స్థాపితం 1925, రిజిస్టర్డ్ నం. H 45

గోలకొండపత్రిక

సంపాదకుడు: ఎన్.నరోత్తమరెడ్డి.ఎం.ఏ

సంపుటి 13, సంచిక 264 | హైదరాబాద్; 25 - 10 - 1960 మంగళవారం | 4 పేజీలు 7 నయాపైసలు

101279

మలయాలో అణ్వాయుధాలు

ఉంచడానికి అంగీకరింపబోమని స్పష్టీకరణ

కౌలాలంపూర్, అక్టోబర్ 24

అణ్వాయుధాలు తమ దేశంలో ఉంచడానికి మలయా ప్రభుత్వం అంగీకరించబోదని ప్రభుత్వ ప్రతినిధి ఒకరు స్పష్టంచేశారు. పైపర్స్, ఏడెన్, సింగపూర్, తూర్పు ఆఫ్రికాలందు బ్రిటిష్ అణుశాంబులు భూగర్భంలో దాచిఉంచబడగలవని లండన్ డైలీ ఎక్స్‌ప్రెస్ ప్రచురించిన ఒక వార్తపై మలయా ప్రభుత్వ ప్రతినిధి పై స్పష్టీకరణను చేశారు.

షిల్లాంగ్‌లో సంపూర్ణ హర్తాళం

షిల్లాంగ్, అక్టోబర్ 24

అఖిలపక్ష కొండ తెగల నాయకుల సభ చర్యాసంఘం అస్సాం అధికారభాషా బిల్లుకు వ్యతిరేకంగా ఆక్షేపణ తెలుపుటకై ఇచ్చిన పిలుపును అనుసరించి జరిగిన హర్తాళంవల్ల షిల్లాంగ్ పట్టణ జీవితం పూర్తిగా స్తంభించినది. అస్సాం అధికారభాషాబిల్లు ప్రస్తుతం రాష్ట్రశాసనసభ పరిశీలనలో ఉన్నది. నేడు శాసనసభనుండి బెంగాలీ భాష మాట్లాడే కాచార్ జిల్లా మరియు కొండజిల్లాల ప్రతినిధులు వాకౌట్ చేశారు. వీరు ఈబిల్లును శామువ్యతిరేకిస్తున్నామన్నారు.

రాష్ట్రపొగాకు ఉత్పత్తి దార్లకు ఋణాలు

కేంద్రాన్ని 2 కోట్లు అడ్వాన్స్‌కై అభ్యర్థించినట్లు శ్రీ రామచంద్రారెడ్డి వెల్లడి

గుంటూరు, అక్టో 24

రాష్ట్రంలోని పొగాకు ఉత్పత్తిదార్లకు ఋణాలిచ్చుటకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని రు. 2కోట్లను అడ్వాన్సుగా యివ్వవలసినదిగా కోరినదని నేడిచట 'పొగాకు గోష్ఠికి' అధ్యక్షత వహిస్తూ రాష్ట్ర వ్యవసాయమంత్రి శ్రీ నూకల రామచంద్రారెడ్డి వెల్లడిచేశారు.

ఈ గోష్ఠిని కేంద్ర వ్యవసాయ మంత్రి శ్రీ పంజాబ్‌రావు దేశ్‌ముఖ్ ప్రారంభించారు.

శ్రీ రామచంద్రారెడ్డి యింకా యిలా అన్నారు:- "పొగాకు పరిశ్రమను అనేకసమస్యలు ఎదుర్కొన్న విషయాన్ని ప్రభుత్వం గ్రహించింది- పొగాకు నేద్యం పెద్ద పెట్టున పెట్టుబడులతో కూడుకొన్న దగుటచే, తరుచు ఉత్పత్తిదార్లు వడ్డీవ్యాపారుల కబంధహస్తాలలో చిక్కుకొని అనేకబాధలనుభవిస్తున్నారు. కాబట్టే పొగాకుఉత్పత్తిదార్లకునహాయంచేసే కొరకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని ఆర్థిక సహాయమడిగింది. ఈ సహాయం తొందరలో లభిస్తుందని నేను ఆశిస్తున్నాను".

పొగాకు ఉత్పత్తిలో గల సాధక బాధకాలను కనుగొనుటకయి ఏర్పరచబడిన ఈ గోష్ఠిలో దేశం నలుమూలలనుండి పొగాకు ఉత్పత్తిలో ప్రవీణులు పాల్గొంటున్న సంగతి పాఠకులకు విదితమే.

ప్రపంచ పొగాకు వినియోగంలో అమెరికా, చైనాల తరువాత స్థానం ఇండియాదేనని శ్రీ రామచంద్రారెడ్డి తెలిపారు. ప్రతిపట్ట ఎగుమతివల్ల రు. 16 కోట్ల విదేశమారకాన్ని తెచ్చే ఈపొగాకు భారతీయ ఎగుమతి సరుకులలో 9వ స్థానాన్ని కలిగినదని ఆయనఅన్నారు.

మనదేశ పొగాకును దిగుమతిచేసుకొనే దేశాలతో కేంద్ర ప్రభుత్వం ఒక దీర్ఘకాలీన ఒప్పందం చేసుకొని ప్రతిపట్ట ఒక సమంజసమయిన ధర నిర్ణయించాలన్నారు. పొగాకు ఉత్పత్తిదార్లకు అవసరమయిన నత్రజనిత రసాయనిక ఎరువులను తగు కోటాలలో కేంద్రం కేటాయించాలన్నారు.

పొగాకు ఉత్పత్తిని అధిక మొనర్చుటకు దానిరకాన్ని మెరుగొనర్చుటకు రసాయనికెరువులు చాలా అవసరమన్నారు. దేశంలో ఉత్పత్తయ్యే మధ్యరకం, నాసిరకం పొగాకును అమ్ముటకు రష్యా, చైనా, మధ్య ప్రాచ్యం, యూరోపు దేశాలలో కొత్తమార్కెట్లనుకనుగొనాలన్నారు. పొగాకుక్షేత్రాలను వర్గీకరించి అందులో ఎటువంటి రకాలను పెంచుటకు వీలుగా వ్యవసాయదార్లకు సలహా నిచ్చుటకయి భారత కేంద్ర పొగాకు సంఘమువారు రాష్ట్రంలో భూసార పరిశీలన జరిపించాలని ఆయన సూచించారు.

పొగాకు పరిశ్రమలో పనిచేసే కార్మికుల అసంతృప్తిని తొలగించుటకు వేతనాలలో ఒకవిధాన మవలంబించబడాలన్నారు.

ఉత్పత్తిఖర్చుల ఆధారంగాను, గోదాముల సౌకర్యదృష్ట్యాను, సిగరేట్ ఫ్యాక్టరీల స్థాపనరీత్యాను, రాష్ట్ర వ్యాపార కార్పొరేషనువారు నిర్ణయించే ఎగుమతికోటా పంపిణీ మొదలగు అంశాలను దృష్టిలో పెట్టుకొని పొగాకుధరను స్థిరీకరించుటకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వానికి ఈగోష్ఠివారు సూచనలివ్వవలసి వుంటుందని ఆయన అన్నారు.

అడుపాతడుపా పొగాకు ఉత్పత్తిదార్లు ఎదుర్కొనే సమస్యలను పరిశీలించి తగు నివారణోపాయాలను సూచించుటకు వీలుగా పొగాకు ఉత్పత్తిదార్లతోను వ్యాపారులతోను, రాష్ట్ర కేంద్ర ఉద్యోగులతో కూడిన అఖిలభారత స్థాయి సంఘ మొకటి ఏర్పడాలని శ్రీ రామచంద్రారెడ్డి అన్నారు.

శ్రీ దేశ్‌ముఖ్ ప్రసంగం

ఎగుమతిచేసే పొగాకు నాణ్యతను పరిపోషించేందుకు భారత ప్రభుత్వం తగు చర్యలు విధించడంవల్ల విదేశాలలోనున్న పొగాకును కొనేవారికి విశ్వాసం పెరిగినదని ప్రపంచ మార్కెట్లలో భారతదేశం పొగాకు విలువ హెచ్చుగలదని కేంద్ర వ్యవసాయ ఉపమంత్రి డాక్టర్ పంజాబ్‌రావు దేశ్‌ముఖ్ పేర్కొన్నారు.

భారతీయ పొగాకు పరిశ్రమ సదస్సుకు ప్రారంభోత్సవం చేస్తూ శ్రీ దేశ్‌ముఖ్ పై విధంగాఅన్నారు. దేశ ఆర్థిక వ్యవహారాలలో పొగాకు ప్రధాన భూమికను వహిస్తున్నదని 16 లక్షల ఉత్పత్తి దార్లకు మరో తొమ్మిది లక్షల మందికి పనిని కల్పిస్తున్నదని వీరన్నారు. పొగాకు వాణిజ్యంలో ఐదు లక్షల వర్తకులు కమిషన్ ఏజెంట్లు కలరు. దేశపు వివిధ భాగాలలో లక్షలాది ప్రజానీకానికి పొగాకు పరిశ్రమ జీవనోపాధిని చూపుతున్నది. ఉత్పత్తిదారులకు వ్యాపారస్తులకు ఇది మంచి ఆదాయాన్ని ఇస్తున్నది. 1958-59 లో పొగాకు రు. 14 కోట్లను 1957-58లో రు. 45.8 లక్షలను ఎగుమతి రూపములో కేంద్రానికి ఆర్జించిపెట్టినది.

శ్రీ దేశ్‌ముఖ్ ఇంకా ఇలా తెలిపారు:-

ప్రపంచంలో పొగాకు ఉత్పత్తి దేశాలలో భారతదేశం మూడవ స్థానాన్ని ఆక్రమిస్తున్నది. 1958-59 లో 896 వేల ఎకరాలలో 589 మిలియన్ పౌండ్ల పొగాకు పండించబడినది. భారతదేశములో పొగాకు పండించే రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ప్రధానమైనది. మనదేశంలో జరిగే పొగాకు ఉత్పత్తిలో 35 శాతం ఆంధ్రలోనే పండుతుంది. మన దేశంలో ఉత్పత్తి అయ్యే వర్జినియా పొగాకు 95 శాతం ఇక్కడే పండుతుంది.

ఇండియా-సోవియట్ వాణిజ్యం

1963 అంతంవరకు రెండింతలయ్యే సూచన

కొత్తఢిల్లీ, అక్టోబర్ 24

కేంద్ర వాణిజ్య పరిశ్రమలమంత్రి లాల్‌బహదూర్‌శాస్త్రి సోవియట్ విదేశ వాణిజ్య మంత్రి ఎన్. ఎస్. పటోలిచెవ్‌ల మధ్య జరిగిన సంప్రదింపుల ఫలితంగా 1963 అంతంవరకు ఇండో-సోవియట్ వాణిజ్యంరెండింతలుకాగలదు. ఉభయదేశాలమధ్య కొత్తసరుకులు మార్చుకొనబడుతవి.

1959లో భారతదేశం రష్యాకు రూ. 80.86 కోట్లు మేరకు ఎగుమతి చేసినది. సోవియట్ దేశంనుండి చేసుకోబడిన దిగుమతులు రూ. 16.65 కోట్ల విలువగలవి.

ఉభయదేశాల మధ్య ఐదేండ్ల వాణిజ్య ఒప్పందం కలదు.

కటాంగాలోని సమితి అధికారి

బలవంతంగా తొలగింపగలమని బెదరింపు

ఎలిజబత్ విల్లి, అక్టోబర్ 24

కటాంగా రాష్ట్రంలోని సమితి ఉన్నతాధికారి ఐన్ బెరండ్‌సన్‌ను సైనిక బల ప్రయోగంద్వారా వెళ్ళగొట్టగలమని కటాంగా రక్షణమంత్రి బెదరించాడు.

బెరండ్‌సన్‌ను వెనక్కు పిలిపించుకో వలసినదిగా కటాంగా అధ్యక్షుడు పాంబే కాంగోలోని సమితి సైన్యాధ్యక్ష వర్గానికి తొలుత ఒక విజ్ఞప్తిచేశాడు. ఇప్పుడు కటాంగా రక్షణ మంత్రి ఈతన్ని ఉపసంహరించనిచో బలప్రయోగం చేస్తానని హెచ్చరిస్తున్నాడు.

నాగపూర్ ఇంజనీర్‌కు కత్తిపోట్లు

నాగపూర్, అక్టోబర్ 24

నాగపూర్ డివిజన్ రోడ్ బిల్డింగ్స్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎన్.ఎమ్. అండ్రెనెను 20 సంవత్సరాల యువకుడు ఇంటర్వ్యూకనివచ్చి కత్తితోపొడిచి తీవ్రంగా గాయపరచాడు. ఈయువకుడు ట్రేడ్ యూనియన్ నాయకుడని చెప్పబడుతున్నది.

వ్యవసాయోత్పత్తిని అధికంచేసే కృషి

పశ్చిమ గోదావరి జిల్లాలో అమలుజరుపుతున్న పేకేజి పథకముపై చర్చ

ఏలూరు, అక్టో 24

వ్యవసాయోత్పత్తిని విస్తృతపరిచే పేకేజిపథకం జిల్లా కార్యక్రమ రాష్ట్రసమన్వయ సంఘ ప్రథమ సమావేశం రెవిన్యూ బోర్డు సభ్యుడు శ్రీ ఎం.టి. రాజు అధ్యక్షతలో శనివారం యిక్కడ జరిగింది.

వ్యవసాయశాఖ డైరెక్టర్ శ్రీ డి. విశ్వనాథరెడ్డి జాయింట్ డైరెక్టర్ శ్రీ టి.వి.రెడ్డి పశ్చిమ గోదావరిజిల్లా కలెక్టర్ సర్దార్ ఖాన్, సహకార సంఘాల జాయింట్ రిజిస్ట్రార్ త్రిసదాశివం ప్రభృతులు హాజరైనారు. ఈ కార్యక్రమ అమలుకై నియోగించబడిన యిద్దరు అమెరికా స్పెషలిస్టులు కూడా హాజరైనారు.

ఈజిల్లాలో కార్యక్రమాన్ని అమలు జరపడానికి ఎన్నుకోబడిన ప్రతి బ్లాకులోని నిర్ణీత ప్రాంతాలలో వ్యక్తిగత ఉత్పత్తి ప్రణాళికల్ని కమిటీ పరిశీలించినది. ప్రస్తుత రబ్బీపంటతో ప్రారంభమైన యీకార్యక్రమము 20 శాతం రబ్బీ పరిపంట, అదేశాతము మిరప చెరకు అరటి పంటలకు వర్తిస్తుంది.

ఈకార్యక్రమం మొదటి సంవత్సరంలో ప్రతిబ్లాకులోని 20 శాతం ప్రాంతం ఎన్నుకోబడింది.

ఈ కార్యక్రమాన్ని అమలుజరిపే ప్రాంతంలోని రైతులకు సత్వరము క్రెడిట్ సౌకర్యాల్ని కలిగించాలనే అంశంకూడా ఆసమావేశంలో పరిశీలించబడింది.

కృష్ణా-గోదావరి జలాల వివాదం

బొంబాయి, అక్టో 24

ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మైసూరులమధ్య కృష్ణా-గోదావరి జలాలగూర్చి ఉత్పన్నమైన వివాదం మధ్యవర్తిత్వానికి నివేదించే అవకాశం కలదని మహారాష్ట్ర ముఖ్యమంత్రి వై. బి. చ్యవన్ అన్నారు.

పంజాబ్‌లో అకాలీ ఉద్యమం

శాంతిభద్రతలస్థితికి భంగంలేదని స్పష్టీకరణ

చండీఘర్, అక్టోబర్ 24

గత నాల్గు మాసాలనుండి అకాలీ ఆందోళనను ఎదుర్కొనడములో పంజాబ్ పోలీసులు నిమగ్నమై ఉన్నా శాంతిభద్రతల పరిపోషణ యథాప్రకారంగానే కొనసాగుతున్నదనిరాష్ట్ర ప్రజాజీవితాన్ని అకాలీఉద్యమం భగ్నపరచలేదని పంజాబ్ రాష్ట్ర శాసనసభలో ముఖ్యమంత్రి సర్దార్ ప్రతాప్ సింగ్ కైరాన్ నేడు ప్రకటించారు.

వెనుకబడిన తరగతుల సంక్షేమం

ఆంధ్రప్రదేశ్ 3 వ పంచవర్ష ప్రణాళిక

ఖరారు చేయడానికి డిసెంబర్ 10, 11 తేదీలలో ఢిల్లీలో చర్చలు

హైదరాబాద్, అక్టో 24

ఆంధ్రప్రదేశ్ తృతీయ పంచవర్ష ప్రణాళికవివరాల్ని రూపొందించడానికై డిసెంబరు 10, 11 తేదీలలో న్యూఢిల్లీలో చర్చలు జరగబోతున్నవి.

ప్లానింగు, ఆర్థికశాఖల కార్యదర్శులు కూడ ఉండే ఉద్యోగుల ప్రతినిధి వర్గానికి ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం. పి. పాయ్ నాయకత్వం వహిస్తారు. తృతీయ ప్రణాళికలో చేర్చబడిన పథకాల ప్రాధాన్యక్రమాన్ని గురించి వీరు చర్చలు జరుపుతారు.

ఇటీవల ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ మంత్రులు ప్లానింగు కమిషన్‌తో జరిపిన చర్చలలో ప్రణాళికా పరిమితిని రు. 305 కోట్లకు నిర్ణయించడం పాఠకులకు విదితమే.

నవంబరు 1న లక్ష ఖర్చుతో పథకాలు

నల్లగొండజిల్లా నారాయణపూర్ పంచాయతీసమితి నిర్ణయం

నల్లగొండ, అక్టోబరు 24

నల్లగొండజిల్లా నారాయణపూర్ పంచాయతీ సమితి అధ్యక్షుడు శ్రీ కె. రామకృష్ణారెడ్డి పంచాయతీ రాజ్యాన్ని ప్రవేశపెట్టిన ప్రథమ వార్షికోత్సవము సందర్భముగా నవంబరు 1న రు. 1 లక్ష ఖర్చుతో పంచాయతీసమితిలోని వివిధ గ్రామాలలో పనుల్ని అమలు జరపాలని నిర్ణయించబడిందన్నారు.

ఆ పనులలో పాఠశాల భవనాలు, త్రాగే నీటిబావులు, మైనర్ ఇరిగేషన్ పనులు, రోడ్ల నిర్మాణము, ఉచిత మధ్యాహ్నభోజనము ప్రవేశపెట్టడం చేరి ఉన్నవి. ప్రభుత్వము ఖర్చుచేసే రు. 1 లక్షకు తోడు ప్రజావిరాళాలు రు. 30,000 వరకూ ఉంటాయని అంచనా వేయబడింది.

గుడ్డిమల్కాపూరు, సర్వేలు, ముంగోడె, దొనిపాముల, తాళ్ళయల్ల మల అనే ఐదు ప్రదేశాలలో కొత్తపాఠశాలలు తెరవబడుతాయని సమితి అధ్యక్షుడు వెల్లడించారు. సర్వేలులో ఉచిత మధ్యాహ్నభోజన పథకము ప్రారంభోత్సవము చేయబడుతుంది. రు. 38వేల ఖర్చుతో నాలుగు పక్కా రోడ్లు, 22 కచ్చా రోడ్లు వేయబడుతాయి. కచ్చారోడ్లన్నీ శ్రమదానం ద్వారానే నిర్మించబడుతాయి, ఆరు యువజనక్లబ్‌లు, కొన్ని గ్రంథాలయాలు తెరవబడుతాయి.

బారిసాల్ జిల్లాలో మృతుల సంఖ్య

వేయి అని మార్షల్ లా అడ్మినిస్ట్రేటర్ ప్రకటన

ఢాకా, అక్టో 24

ఈ మధ్య తూర్పు పంజాబ్‌లో వచ్చిన తుఫాన్ మరియు ఉప్పెనవల్ల బారిసాల్ జిల్లా కోస్తా ప్రాంతంలో దాదాపు వెయ్యిమంది చనిపోయారని ఈ రాష్ట్ర మార్షల్ లా అడ్మినిస్ట్రేటర్ మేజర్ జనరల్ అబ్దుల్ రహీమ్‌ఖాన్ నేడు పత్రికా ప్రతినిధులకు తెలిపారు.

బొంబాయిలో ఠాగూర్ శతాబ్ద్యుత్సవాలు

బొంబాయి, అక్టో 24

1961 జనవరి 1వ తేదీన బొంబాయిలో ఠాగూర్ శతాబ్ది జయంత్యుత్సవాలకు ప్రధాని నెహ్రూ ప్రారంభోత్సవం జరుపుతారు.

తిండిపోతులకు శుభవార్త

లండన్, అక్టోబర్ 24

"గై" వైద్యశాల యందు ఫార్మకాలజీ రీడర్ డాక్టర్ జోసెఫ్ నిస్సిచే కనిపెట్టబడిన "ట్రిమెథిల్-హెక్సా-డెసిల్-అమోనియం స్టిరియేట్" అను నొక ఔషధాన్ని లండన్ నందలి ఒక ప్రసిద్ధ వైద్యాలయంలో పరీక్షచేస్తున్నారు. తిండిపోతులు యితర స్త్రీ పురుషులు యీమందును సేవించినట్లయితే ఎంతైనా తినవచ్చు. తిన్నపదార్థమునంతయు శరీరమునకు యేలాటి హాని కలిగించకుండ యిది మలిన రూపంలోకిమారుస్తుంది. ఎంత తిన్ననూ మనిషి యీమందు ప్రభావము చేత లావెక్కడు.

హత్యానేరంలో 14గురి అరెస్టు

హైదరాబాద్, అక్టో 24

ఈ నెల 12వ తేదీన గుంటూరు జిల్లా దుగ్గిరాల లో అతుకూరి రెడ్డి హత్య జరిగిన సందర్భంగా 14 మంది హత్య, దొమ్మి నేరాలక్రింద పోలీసులచేత అరెస్టు గావింపబడ్డారని నేడు చుచటికి అందిన వార్తలవల్ల తెలుస్తున్నది.

ఈ సంఘటన జరిగిన రాత్రి ఇరు పక్షాలకు చెందినవారు లాఠీలు పుచ్చుకొని ఘర్షణ పడ్డ కారణంగా ఇరు పక్షాలలో 8 మంది గాయపడినారు. వారిలో తీవ్రంగా గాయాలు తగిలిన అతుకూరి రెడ్డి మరునాడు ఆస్పత్రికి కొనిపోబడిన తదుపరి అచట మరణించాడు.

గత పంచాయత్ యెన్నికల ఫలితంగా ఈ వైషమ్యాలు లేర్పడినవని తెలుస్తున్నది.

ఈ అరెస్టు చేయబడినవారు దర్యాప్తు జరిగేవరకు కోర్టు కస్టడీలో వుండగలరు. పరిస్థితులు ప్రశాంతంగా వున్నా, పోలీసులు తగు చర్యలు గైకొన్నారు.

మూడవ ప్రణాళికలో మరికొంత మొత్తం కేటాయించాలనిఅభ్యర్థన

కొత్తఢిల్లీ, అక్టోబర్ 24

వెనుకబడిన తరగతుల అభివృద్ధి స్కీములకై మూడవ ప్రణాళిక ముసాయిదాలో కేటాయింపబడిన రూ. 100 కోట్లను మరికొంత హెచ్చించవలసినదిగా కేంద్ర హోంమంత్రి ప్లానింగ్ కమిషన్‌ను కోరారు.

శ్రీపంత్ నేడురాష్ట్రాలలోని వెనుకబడిన తెగలసంక్షేమ మంత్రుల రెండు రోజుల సభలకు ప్రారంభోత్సవం చేశారు. రెండవ ప్రణాళికలో వెనుకబడిన తరగతులకై రూ. 90 కోట్లు కేటాయింపబడినదనిఇప్పుడదిమూడవ ప్రణాళికలో మరో పదికోట్లు పెంచబడినదని ఈ మొత్తం ప్రస్తుతావసరాల దృష్ట్యా ఏమాత్రంచాలదని అన్నారు పండిత్ పంత్.

ఈసభలకు కేంద్రమంత్రులు గుల్జారీలాల్‌నందా, డా॥కె. ఎల్. శ్రీమాలి, బి.ఎన్. దాతార్ గూడా హాజరయినారు.

వెనుకబడిన తరగతుల అభివృద్ధి స్కీములకై ప్లానులో కేటాయింపబడిన మొత్తాలు తగ్గడంగూర్చి కేంద్ర హోంమంత్రి ప్రస్తావించారు. 1959-60 లో రెండుకోట్లు డబ్బు ఈ స్కీములకై తక్కువ కేటాయించబడినదని రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయమై శ్రద్ధ తీసుకోవాలని తమ స్కీములలో మార్పు చేయవలసివచ్చిన ప్లానింగ్ కమిషన్‌తో సంప్రదించాలని ఎట్టి పరిస్థితుల్లోను డబ్బు వాడకుండా వర్షమైపోయేట్టు చూడరాదని వీరు సలహా ఇచ్చారు. వెనుకబడిన వర్గాల సంక్షేమ వ్యవహారాల చూచేమంత్రులు నెల నెలా అభివృద్ధి రిపోర్టుల తెప్పించుకొని అభివృద్ధికృషి సరిగా జరుగుతున్నదీ లేనిదీ పరిశీలించాలని కోరారు.

32 భారతీయ డాక్యుమెంటరీలు

మలయా ప్రభుత్వానికి సమర్పణ

కౌలాలంపూర్, అక్టో 24

మలయాలోని భారత కొత్త హైకమీషనర్ శ్రీ యు. కె. పూరి నేడు ఇన్‌ఫర్‌మేషన్ సర్వీసెస్ యొక్క ఫిల్మ్‌లైబ్రరీ ఫెడరేషన్‌కు 32 భారత డాక్యుమెంటరీ ఫిల్ముల్ను (ఇంగ్లీషు, తమిళం) సమర్పించారు.

మలయా ప్రభుత్వ సమాచార ప్రసారశాఖ అసిస్టెంట్ కార్యదర్శి శ్రీ టువాన్ సయ్యిద్ జాఫర్ నేడు వీటిని తన కార్యాలయంలో స్వీకరించారు.

ఈ ఫిల్ములు భారతీయ సంస్కృతి, విద్య, సాంఘిక, ఆరోగ్య విషయాలకు సంబంధించినవి.

మాజీ జాగీర్దార్ల ఇబ్బందులు

ఉపముఖ్యమంత్రికి నివేదన

హైద్రాబాద్, అక్టోబర్ 24

మాజీ జాగీర్దార్లు మరియు నగదు గ్రాంట్ల పొందే వారి ఇబ్బందులు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి శ్రీ కె. వి. రంగారెడ్డిగారి దృష్టికి తీసుకొనిరాబడినవి. వీరికి తమఇబ్బందుల నివేదిస్తూ 200 మాజీ జాగీర్దార్లు హిస్సేదార్లు మెమొరాండాన్ని సమర్పించుకున్నారు.

గుడిసె అంటుకొని ఒకవృద్ధురాలి మరణం

హైద్రాబాద్, అక్టోబర్ 24

దక్షిణ వైజాగ్‌లోని సులగోలగ్రామంలో తాను నివసిస్తున్న గుడిసెకు నిప్పంటుకొనుటవల్ల 70 ఏండ్లు దాటిన యీడుగల అచ్చాయమ్మ అను నామె దుర్మరణమునకు గురైనదని యిచటికి అందిన వార్తలవల్ల తెలుస్తున్నది.

టోకియోలో కొలంబో ప్రణాళికా మహాసభ

భారత ప్రతినిధి వర్గానికి శ్రీమతి సిన్హా నాయకత్వం

న్యూఢిల్లీ, అక్టోబరు 24

కొలంబో ప్రణాళికా సంప్రదింపుల సంఘం వార్షిక సమావేశం 1960 నవంబరు 14వ తేదీన టోకియోలో ప్రారంభమై నాలుగు రోజులపాటు జరుగుతుంది.

కేంద్ర ఆర్థికశాఖ ఉపమంత్రి శ్రీమతి కాశీకేశ్వరి సిన్హా భారత ప్రతినిధి వర్గానికి నాయకత్వం వహిస్తారు. ఈ ప్రతినిధి వర్గంలో సభ్యులు వీరు:

శ్రీ ఎన్. సి. సేన్ గుప్తా కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి.

శ్రీ ఎ. టి. బంసేవాలే కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఉప కార్యదర్శి.

శ్రీ ఎస్. ఎస్. మరాఠే కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఉప ఆర్థిక సలహాదారు.

టోకియోలోని భారత రాయబార కార్యాలయం ఉద్యోగులలో కొంతమందినికూడా యీ ప్రతినిధి వర్గంలో చేర్చుకుంటారు.

మంత్రుల స్థాయి సమావేశం ప్రారంభమవడానికి ముందు వార్షిక నివేదికను తయారు చేసేందుకుగాను 19 సభ్యదేశాల ఉద్యోగులు యీ నెల 31 నుంచి రెండు వారాల పాటు చర్చలు జరుపుతారు.

భారత ప్రతినిధి వర్గంలో సభ్యులైన ఉద్యోగులు యీ నెల 29వ తేదీన భారత దేశంనుంచిటోకియోకు బయలుదేరుతారు. ప్రతినిధి వర్గం నాయకులు శ్రీమతి సిన్హా కొద్దిరోజుల తరువాత బయలుదేరుతారు.

నాగపూర్‌లో మహారాష్ట్ర శాసనసభ సమావేశం

నవంబరు 10 నుండి శాసనమండలి గూడా

నాగపూర్, అక్టోబర్ 24

నవంబర్ మొదటి నుండి మూడు మాసాలకై మహారాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్య స్థానంగా నాగపూర్ చేయబడుతుంది.

ఈ కాలంలో రాష్ట్రశాసనసభ శాసనమండలి నాగపూర్‌లో సమావేశమవుతవి. ఇవి నవంబర్ నుండి సమావేశమవుతవి.

రష్యాలో ఠాగూర్ శతజయంత్యుత్సవ సన్నాహాలు

మాస్కో, అక్టో 24

రవీంద్రనాథ్ ఠాగూర్ శతజయంత్యుత్సవ సోవియట్ సంఘము యీ భారతీయ మహాకవి శతజయంతి వుత్సవ సన్నాహాలగురించి చర్చించేందుకు గతవారంలో సమావేశమైంది.

ప్రసిద్ధ రచయిత నికొలై టి. భోనోవ్ యీసంఘానికి అధ్యక్షుడు.

ప్రపంచ శాంతి సంఘము ప్రతిపాదించిన యీజయంతి వుత్సవాలు అన్ని దేశాలలో పెద్దఎత్తున జరుగుతాయి. సోవియట్ దేశంలో యీ సందర్భంగా ఠాగూర్ రచనల కొత్త సంకలనం వెలువడుతుంది; పత్రికలు ప్రత్యేక సంచికలు ప్రచురిస్తాయి; ఠాగూర్ చిత్రంతో తపాలా బిళ్లలు జారీచేయబడతాయి. ఆయన గ్రంథాల ప్రదర్శనం ఏర్పాటుచేయబడుతుంది. (—టాస్)

ఈనెల 18వ తేదీన ఆమె ఉదయమే లేచి ఒకవెలుగుతున్న దీపాన్ని ప్రమాదవశాత్తు పడగొట్టుటవల్ల గుడిసె నిప్పంటుకున్నట్టు తెలుస్తున్నది. పోలీసులు దర్యాప్తుచేస్తున్నారు.

పిలిపిన్స్ కూడ వలస రాజ్యంగా ఉంది

దీనికికూడ స్వాతంత్ర్యం యివ్వాలనే సూచనను రష్యా బలపర్చాలని దలైలామా అభ్యర్థన

ఐక్యరాజ్యసమితి, అక్టో 24

దలైలామా ఐక్యరాజ్యసమితి జనరల్ సెక్రటరీకి వ్రాసిన లేఖలో వలస ప్రజలకు సత్వర స్వాతంత్ర్యం యివ్వాలని ప్రతిపాదించినట్లే సోవియట్ యూనియన్ టిబెట్‌కు తిరిగి స్వాతంత్ర్యాన్నివ్వాలనే సూచనను బలపర్చాలని పేర్కొన్నారు.

టిబెట్‌ను వీడిన 24 సంవత్సరాల దలైలామా తన లేఖలో కమ్యూనిస్టు చైనా టిబెట్‌ను "వలస రాజ్యంగా యి" దిగజార్చినదని పేర్కొన్నారు.

"ఇతర దేశాలతోబాటు సోవియట్ యూనియన్‌కూడ మా దేశానికి స్వాతంత్ర్యాన్ని యివ్వాలనే సూచనను బలపరచాలి" అని ఆయన పేర్కొన్నారు.

జనరల్ అసెంబ్లీ యీ సంవత్సరంలోనే మలయా ఫెడరేషన్, థాయిలాండ్‌ల ప్రతిపాదనపై టిబెట్ సమస్యపై చర్చజరప బోతున్నది.

టిబెట్‌నుండి శాంతిరక్షకులు యింకా నేపాల్, భూటాన్, సిక్కిం, భారత దేశాలకు తరలివస్తున్నారనీ, యిప్పటికే వారి సంఖ్య 49,500కు పెరిగిందనీ దలైలామా పేర్కొన్నారు.

సూరత్ జిల్లాలో మిడుతల దండు

అహ్మదాబాద్, అక్టో 24

సూరత్‌లోని ఉంబర్‌గామ్ తాలూకాలోకి 5 చదరపు మైళ్ళ మిడుతల దండు ప్రవేశించినదని నేడు వర్తమానం అందినది జామ్‌నగర్ ప్రాంతంలో మిడుతల దండును నిర్మూలించడంలో ఉపయోగింపబడుతున్న విమానాన్ని ఇక్కడ గూడా వాడుకో నివ్వవలసినదిగా కేంద్ర ప్రభుత్వాన్ని గుజరాత్ ప్రభుత్వం అభ్యర్థించినది.

జపాన్ దిగువసభ రద్దు

టోకియో, అక్టోబర్ 24

జనరల్ ఎన్నికల నిర్వహణకుతొలి మెట్టుగా జపాన్ పార్లమెంటు దిగువ సభ రద్దుచేయబడినది.

గుంటూరుజిల్లా రైతుమహాసభ

నర్సారావుపేట, అక్టోబర్ 24

గుంటూరుజిల్లా రైతు మహాసభ, అక్టోబరు 16 న నర్సారావుపేటలో ఏంజల్ టాకీసునందు శ్రీ పి. దశరథ రామయ్య చౌదరి అధ్యక్షతన జరిగినది.

సభలో సమిష్టిసహకార సేద్యమును ప్రతిఘటించవలసిన ఆవశ్యకతను గురించి, ఎరువుల పంపకవిధానమును గురించి, మొదలగు రైతు సమస్యలను గురించి రాష్ట్రజన సంఘ అధ్యక్షులు శ్రీ జూపూడి యజ్ఞనారాయణ ప్రధానకార్యదర్శి శ్రీ డి.యస్ పి. రెడ్డి ప్రభృతులుపన్యసించిరి.

తరువాత ప్రభుత్వమువారు ప్రవేశపెట్టుచున్న సమిష్టి సహకార వ్యవసాయ విధానము వలన రైతులు దినదినము కూలీలుగా మారుప్రమాదము గలుగుటయేగాక, అనేక అనర్థములు సంభవించును గాబట్టి దానిని విరమించుకొనవలెననియూ, ఎరువుల పంపిణీ సక్రమముగ, సకాలంలో, సరియైన ధరలకు రైతులకు సరఫరా చేయవలెననియూ రాష్ట్రప్రభుత్వము వారిని కోరుచు తీర్మానించిరి.

జనసంఘ సమావేశాలు

16-10-60 తేదీ ఆదివారం నర్సారావుపేటలో పొట్టి శ్రీ రాములు విగ్రహము వద్ద, పట్టణ జనసంఘ్ అధ్యర్యమున శ్రీ డి. రామనాథం (అడ్వకేట్)గారి అధ్యక్షతన గొప్ప బహిరంగ సభ జరిగినది.

సభలో ప్రస్తుత ఆహార ఆర్థిక సమస్యలు, చిన్న నీటి తరహా పథకాలను వెంటనే అమలు పరచవలసిన ఆవశ్యకతను గురించి, కాశ్మీర్ సమస్య, విదేశాంగ విధానము మొదలగు వానిని వివరించుచూ, జిల్లా కార్యదర్శి శ్రీ టి. రామాచార్యులు, శ్రీ అవసరాల రామారావు (ఎం. ఎల్. సి) హైదరాబాద్ జనసంఘ్ కార్యదర్శి వీ. లక్ష్మీనారాయణ, రాష్ట్రజనసంఘ సహాయ కార్యదర్శి శ్రీ ఎం వి. సీతారామయ్య ఉపన్యసించిరి.

జిల్లాజనసంఘ్ సహాయ కార్యదర్శి శ్రీ బి రవీంద్రనాథ్‌గారి వందన సమర్పణతో సభ జయప్రదముగా ముగిసినది.

పరిపాలనాసంస్కరణల సంఘ నివేదిక

ఈనెలాఖరులోగా ప్రభుత్వానికి సమర్పణ

హైద్రాబాద్, అక్టోబరు 24

పరిపాలనా సంస్కరణల సంఘం యీ నెలాఖరులోగా తమ నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తుందనుకొంటున్నారు.

శ్రీ కె. ఎం. ఉన్నితన్ అధ్యక్షుడుగా కల యీ సంఘం నివేదికను రూపొందించడం ప్రారంభించినదని చెప్పబడుతున్నది. .....

కొత్త ఉర్దూ దినపత్రిక "ఆమర భారతి"కి నవంబరు 1వ తేదిన ముఖ్యమంత్రి శ్రీ సంజీవయ్య ప్రారంభోత్సవము చేస్తారు. శాసన పరిషత్తు అధ్యక్షుడు శ్రీ మాడపాటి హనుమంతరావు అధ్యక్షతవహిస్తారు. "మిలాప్" మాజీసంపాదకుడు శ్రీ పూరణ్ చంద్ పాక్షిక్ దీనికి సంపాదకుడు.

డాక్టర్ ఎం. కె. పండిట్

ప్రిన్సిపాల్ మెడికల్ కాలేజి మొహతెమీం ఉస్మానియా అసుపత్రి ప్రెస్టేజ్ ఇట్లు వ్రాయుచున్నారు: నేను గత కొంతదినములలో డాక్టర్ లుఖ్మాన్‌గారితో కలియుట తటస్థించినది. వారితో నా కంటి పరీక్ష చేయించితిని ఎందుకన నా కంటి అద్దముల వలన బాధ చెందుచుంటిని. నాకంటి పరీక్ష చేసి నందుకుగాను నాకు తృప్తి కలిగి ఆనందము చేకూరినది మంచిగా పరీక్షించిరి. వీరు కంటి పరీక్షలో చాలా నేర్పరి అనుటలో ఏలాంటి సందేహములేదు. వారు రెఫ్రాక్షన్ టెస్టు (కంటి పరీక్ష చేయు విధానము) లో చాల నేర్పరి నేను నా మిత్రులద్వారా వారి సంగతివిని నా వయస్సుకు అనువగు మంచి అద్దములు ఇవ్వగలరని నమ్మితిని. నా నమ్మకము నిజమని రుజువైనది. వారు పరీక్షించి యిచ్చిన అద్దములు ఇపుడు వాడుచున్నాను. చాల నమ్మకమైనవి. నా కండ్లకొరకు వారు ఇచ్చిన మాలాము చాల లాభకరమైనది. వీరి ప్రతి పని ప్రతిభావంతముగా ఉండునని నా అనుభవమువల్ల చెప్పుచున్నాను. వీరు తమ ప్రతిభతో చాలా కాలము ప్రజాసేవ చేయుదురుగాక యని దేవునిప్రార్థిస్తున్నాను. రెఫ్రాక్షన్ అనునది ఒకకళ, మరియు డాక్టర్ గారు ఈ కళలో అనుభవముగల ఉపాధ్యాయుడు.

సం॥ ఎం. కె. పండిట్,
(ఎం. ఎ. ఎం. ఆర్. సి. పి. డి. ఎం. టి. బి. డి.)
కాచీగూడ, స్టేషన్ రోడ్,
హైద్రాబాద్.

శార్వరి సం॥ కార్తీక శు॥ పంచమి
ఉ 6-41 పష్ఠి తె 4-19 మూల ప3-5
ప వ 1-36 మొ: 3-5 వరకు
రా వ 12-3 మొ: 1-38 వరకు
(శాలివాహన శకము: 3-8-1882)
1960 అక్టోబరు 25 మంగళవారము

"పురికి యనఁగఁ బరఁగు
పురిఁ బౌరికుం డను
నృపతి క్రూరకర్మనిష్ఠఁ
బరఁగు నవ్విభుండు
సచ్చియధిప గోమాయు
వై పుట్టెఁ బుట్టె
ఱుంగు బుద్ధితోడ."

- భారతము (శాంతి)

గోలకొండపత్రిక

ఫోన్. నెం. 3280

1960 అక్టోబరు 25
మంగళ వారము

కృష్ణా, గోదావరి నదీ జలాలు

ఆంధ్ర దేశానికి జీవనాడులు కృష్ణా, గోదావరి నదులు. తెలుగుసీమ ఆర్థిక, సామాజిక వ్యవస్థకు యీ రెండు నదులు ప్రధాన ప్రాతిపదికలై యున్నవి. ఈ నదుల జలాలను ప్రజల క్షేమానికి, వ్యవసాయ వృత్తి యొక్క అభ్యుదయానికి వినియోగించి, ఆంధ్ర దేశానికే గాక సమస్త భారత దేశానికి గల ఆహార అవసరాలను తీర్చుటకై ఉద్దేశించిన ప్రణాళికల అమలుకు పొరుగు రాష్ట్రాలైన మైసూరు, మహారాష్ట్రములు యేవేవో కుంటిసాకులు చెప్పి ప్రతిబంధకాలు కల్పించబూనుట అత్యంత సంతాపకరమైన సత్యము. ఇప్పటి వరకు ఆంధ్ర ప్రదేశ్‌కు పొరుగు రాష్ట్రాలు గావించిన నష్టము యెంతయో కలదు. రామపాదసాగర్ ప్రాజక్టును ఉపసంహరించుకొనుటకును, బళ్ళారి ప్రాంతమును పోగొట్టుకొని, తుంగభద్రానది జలాలలో తమకు న్యాయమైన వంతును రాబట్టుకొన లేకపోవుట వలన యీ పొరుగు రాష్ట్రాల మొండి పట్టుదలలు ముఖ్యకారణములైనవి. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము మెత్తదనముగా వ్యవహరించి, ఖండితముగా మాట్లాడి పట్టుదల వహించనందు వలన ప్రతిపర్యాయము నష్టపడవలసి వచ్చినది. గడచిన అనుభవమును దృష్టిలో నుంచుకొని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము పట్టుదలతో కృషిగావించి, తెలుగు ప్రజలకు యీ నదీజలాలలో రావలసిన న్యాయమైన వంతును సాధించవలసియుండును. ఈ విషయమై మన పబ్లికువర్క్సు మంత్రి శ్రీ అల్లూరి సత్యనారాయణ రాజుగారు గావించుచున్న కృషి సర్వవిధాల ప్రశంసనీయమై యున్నది. ఆంధ్ర ప్రదేశ్‌లోని అన్ని రాజకీయ పక్షాలు, అన్నివర్గాలు శ్రీ సత్యనారాయణ రాజుగారి విధానమును యేకకంఠముగా బలపరచుచున్నవి. తెలుగు ప్రజల పూర్తి అండదండలు శ్రీ సత్యనారాయణరాజుగారికి లభించియున్నవి.

కొన్ని వారాలక్రింద యీ విషయమై మైసూరు, మహారాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులతో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వప్రతినిధులు కృష్ణా, గోదావరి నదీజలాల విషయమై సంప్రదించుట జరిగినది. ఆసందర్భమున సంప్రదింపులలో పాల్గొనిన శ్రీ సత్యనారాయణరాజుగారు ఆంధ్ర ప్రదేశ్ వాదమును మిక్కిలి ప్రతిభావంతముగాను, అత్యంత సహేతుకముగాను వివరించియున్నారు. తరువాత మైసూరులో ప్రభుత్వము నాగార్జున సాగర నిర్మాణమును ఆపివేయవలెనను మరొక అవివేకమైన అభ్యర్థనను కేంద్రప్రభుత్వానికి గావించినది. మహారాష్ట్ర ప్రభుత్వము పోచంపాడు ప్రాజక్టుకు అంతరాయము కల్పించుచు, గోదావరీ నదీజలాలను కృష్ణలోనికి తరలించవలెనని అసంగతముగా వాదించుచున్నది. ఈ రెండు ప్రభుత్వాలు గావించుచున్న అసమంజసమైన, అవివేకమైన వాదనలకు సమాధానము చెప్పుచు శ్రీ అల్లూరి సత్యనారాయణరాజుగారు ప్రతికావిలేఖరులకు తెలియజేసిన వివరాలు గమనించదగియున్నవి. ఈ సందర్భమున శ్రీ సత్యనారాయణరాజుగారు వ్రాసిన వ్యాసమును గడచిన రెండురోజులలో మా పత్రికయందు ప్రకటించియున్నాము. ఈవ్యాసము ఆంధ్రదేశీయు లందరును అతి శ్రద్ధగా పఠించి, సమస్యను చక్కగా అవగాహన జేసికొని ప్రభుత్వమును సంపూర్ణముగా బలపరచవలసిన ఆవశ్యకతకలదు.

1951 సంవత్సరములో అప్పటి మైసూరు, మద్రాసు, హైద్రాబాదు ప్రభుత్వాలమధ్య కృష్ణా, గోదావరి నదీజలాల పంపకమునుగూర్చి శ్రీ ఖోస్లా నిర్ణయము ప్రకారము ఒక ఒడంబడిక జరిగియుండెను. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము ఆ ఒడంబడికకు కట్టుబడియున్నది. రాష్ట్రాల పునర్నిర్మాణము దృష్ట్యా యేమైన కొద్ది సర్దుబాటులు అవశ్యకమైనచో, వానిని జేసికొనుటకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము సంసిద్ధముగా నున్నది. ఒరిస్సా రాష్ట్రపు నీటి అవసరాలను తీర్చుటకు కావలసిన సహకారమును యిచ్చుటకు గూడ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము సిద్ధముగానున్నది. కాని 1951 సంవత్సరపు ఒడంబడికను తలక్రిందులు జేయగల నిర్ణయాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము ఆమోదించజాలదు. ఈ ఒడంబడికను తలక్రిందులు గావించవలెనని మహారాష్ట్ర, మైసూరు ప్రభుత్వాలు గావించుచున్న వాదము యెంత నిస్సారమైనదో, తత్ఫలితముగా ఆంధ్రప్రదేశ్‌కు యెటువంటి నష్టము జరుగగలదో శ్రీ అల్లూరి సత్యనారాయణ రాజుగారు తమ వ్యాసములోను, పత్రికా విలేఖరులతో జరిపిన సంభాషణలోను చక్కగావివరించియున్నారు. మైసూరు, మహారాష్ట్ర ప్రభుత్వాలకు యిందు వలన జ్ఞానోదయము కలుగగలదని ఆశించుచున్నాము.

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము యొక్క అభిప్రాయములను ప్రధానమంత్రి శ్రీ నెహ్రూకు వివరించుట జరిగినది. ప్లానింగ్ కమిషన్ సభ్యులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము తన అభిప్రాయములను స్పష్టముగా తెలియజేసినది. ఈ సందర్భములో పొరుగు రాష్ట్రాలతో యే ఒడంబడిక జరిగినప్పటికి, అది 1951 సంవత్సరపు నిర్ణయానికి అనుగుణముగా ఉండవలసియుండును. ఈ నిర్ణయములో పెద్దమార్పులు తీసికొనివచ్చు ప్రయత్నము ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము మరియు ప్రజలు పూర్తిగా నిరాకరించగలరు. మూడవ ప్రణాళికలో ఆంధ్రప్రదేశ్ తలపెట్టిన ప్రణాళికలు నిర్విఘ్నముగా అమలుగావించవలసియుండును. ఈ మార్గమున శ్రీ సత్యనారాయణ రాజుగారు గావించుచున్న కృషి సఫలము కాగలదనియు ఆంధ్రప్రదేశ్ ప్రజల చిరకాల మనోరథాలు నెరవేరగలవనియు ఆశిస్తున్నాము. ఆనాడుసర్ ఆర్థర్ కాటన్ మహాళయుడు ఆంధ్రదేశమును అన్నపూర్ణకు ఆటపట్టుగా గావించుటకు ప్రారంభించి అసంపూర్ణముగా వదలిపెట్టిన పథకాలను యీనాడు శ్రీ అల్లూరి సత్యనారాయణ రాజుగారు సంపూర్ణముగా అమలు చేయుటకు గావించుచున్న కృషి విజయవంతము కావలెననియు, అందుకు మూడున్నర కోట్ల తెలుగు ప్రజల సంపూర్ణసహాయ సహకారములు లభించగలవనియు నిస్సందేహముగా విశ్వసించవచ్చును. సమస్త భారత దేశానికి ధాన్యాగారమైనఆంధ్రప్రదేశనదీజలాలు, ప్రాజక్టులు నిజానికి జాతీయమైన ప్రాజక్టులు. ఈ ప్రాజక్టులకు విఘ్నము కలిగించి పొరుగు రాష్ట్రాలైన మైసూరు, మహారాష్ట్రములు అపకీర్తి పాలుగాలకుండుట బుద్ధిమంతులక్షణము.

నదీజలాల వివాదంపై అసెంబ్లీ చర్చ

ఒప్పందాన్నిమార్చరాదని ఏకగ్రీవంగా తీర్మానించగల అవకాశం

హైద్రాబాద్, అక్టో 24

కృష్ణా గోదావరీ నదీ జలాల పంపిణీ ఒప్పందంపై చెలరేగిన వివాదం పరిధానంగా యీమారు నవంబరు 28 నుండి సమావేశం కాగలదని రాష్ట్ర శాసనసభలో చర్చించబడగలదని తెలుస్తున్నది. డిసెంబర్ 16 వరకూ సమావేశం జరుగుతుంది.

1951 ఒప్పందం ఏమాత్రం మార్చరాదని ఆంధ్ర ప్రదేశ్ శాసన సభ ఏకగ్రీవంగా తీర్మానం కావించేఅవకాశం ఉంది. మైసూరు, మహారాష్ట్రప్రభుత్వాలు యీఒప్పందాన్ని మార్చి నీటి కేటాయింపులో కూడా మార్పులు అమలుజరుపాలని కోరుతున్నవిషయం పాఠకులెరిగినదే.

వర్షాలు సమయానికి కురువనందున రాష్ట్రంలో ఏర్పడిన పంటల పరిస్థితిని కూడా రాష్ట్ర శాసనసభ చర్చించగలదు.

ప్రస్తుతం ఉభయ సభల సంయుక్త సెలెక్టుకమిటీముందన్న కమతాలబిల్లు, ఆంధ్ర తెలంగాణప్రాంతాల సహకార చట్టాల సమన్వయబిల్లు శాసన సభలో చర్చకు రాగల మరికొండు ప్రధాన అంశాలు.

పశ్చిమ గోదావరిలో అధికతర వ్యవసాయం

మురుగుకాల్వల రిపేర్లకై కోటిరూపాయల ఖర్చు

ఏలూరు, అక్టో 24

పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రస్తుతం అమలులోవున్న అధికతర వ్యవసాయ కార్యక్రమంక్రింద, జిల్లాలోని అనేక మురుగుకాల్వల రిపేర్లకు ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేశారు. ఈ మురుగుకాల్వలు వ్యవసాయానికి పరిపడేటు అంతరాయం కలిగిస్తూ వుంటాయి. ఈ డివిజన్ యొక్క కేంద్రస్థానం భీమవరంలో వుంటుంది. దీని సబ్‌డివిజన్‌లు తాడేపల్లిగూడెం, నర్సాపురం, భీమవరంలలో వుంటాయి. దీని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా శ్రీ ఎన్. సుబ్బారావును నియమించారు- ఈ మురుగుకాల్వల రిపేర్లకుగాను అయిదేండ్ల కార్యక్రమంలోనూ ఒక కోటిరూపాయలు ఖర్చుచేయబడుతుంది.

కృష్ణాజిల్లా వేరుసెనగ పొగాకు మార్కెటింగు కమిటీ

విజయవాడ, అక్టో 24

శ్రీ బండి తిరుపతయ్యను కృష్ణాజిల్లా గ్రౌండ్‌నట్ అండ్ టుబాకో మార్కెటింగ్ కమిటి అధ్యక్ష పదవి ఈనెల 10వ తేదీ లగాయతు తొలగిస్తూ యిటీవల ప్రభుత్వం ఉత్తర్వులను జారీచేసింది-

కృష్ణాజిల్లా కలెక్టరు శ్రీ బి- సి- గంగోపాధ్యాయ అప్పటినుండి ఆకమిటికి అధ్యక్షులుగావ్యవహరిస్తున్నారు.

శ్రీ కాళహస్తీశ్వర శర్మ షష్టిపూర్త్యుత్సవం

బందరు, అక్టో 24

ఉపాధ్యాయుడుగా పనిచేస్తూ తన జీవితాన్ని సంఘసేవకు అంకితంచేసిన శ్రీ చెర్కూరు కాళహస్తీశ్వరశర్మకు షష్టిపూర్తి మహోత్సవం ఇక్కడి పురమందిరంలో జరిపారు. ఈ సందర్భంలో సన్మాన సంచికను కూడా ప్రచురించారు- ఈ సన్మాన సభకు బందరు మున్సిపల్ చైర్మన్ శ్రీ సన్నాల వేణుగోపాల్ రావు అధ్యక్షత వహించారు- సన్మాన సభాధ్యక్షులు శ్రీ రాళ్ళపల్లిఅచ్యుతరామయ్య(ఎం.ఎల్.ఏ-)స్వాగతం చెప్పారు- శ్రీ కోడాలి ఆంజనేయులు సభనుప్రారంభించారు- సన్మానసంఘం కార్యదర్శి శ్రీ అయినంపూడి గురు నాథరావు ఆ సంఘం తరపున శర్మగారికి నూటపదహార్లు, నూతన వస్త్రాలు సమర్పించారు విశ్వబ్రాహ్మణ సంఘం తరపున శ్రీ కుదరమల్లి జ్వాలాపతి రు. 56 బహూకరించారు- పలువురు అభినందన ప్రసంగాలు కావించారు.

స్త్రీ కారణంగా రెండుహత్యలు

తక్కెళ్ళపాడు, అక్టో 24

గుంటూరుకయిదుమైళ్ళ దూరంలోవున్న తక్కెళ్ళపాడులో సీతామహాలక్ష్మిఅనే ఒకస్త్రీకోసం రెండు హత్యలు జరిగాయి.

ఆయిదేళ్ళ క్రితం గుంటూరులో బ్లాక్ ఆసుపత్రి సమీపంలో ఉండే పువ్వుల భగవాన్‌దాస్‌కు, పొగాకు కంపెనీలో పనిచేసే సీతామహాలక్ష్మికి సంబంధం ఏర్పడి ఆమెతో అయిదేండ్ల క్రితమే యిక్కడకువచ్చారు- సోమవారంరాత్రి భగవాన్‌దాస్ ఆమె ఇంటికివెళ్ళినప్పుడు అక్కడ సీతారామయ్యఅనే తక్కెళ్ళపాడు వాస్తవ్యుడు వున్నాడనీ అందువల్ల ఆమె కోపం వారిద్దరు కొట్లాడుకొన్నారని, భగవాన్‌దాస్ సీతారామయ్యకత్తితో పొడిచి పారిపోవాలని ప్రయత్నించగా గ్రామస్తులు వచ్చి అతనిని బాగా కొట్టారనీ, గాయాలతో అతడుకూడా చనిపోయాడనీ తెలుస్తున్నది.

సీతామహాలక్ష్మికి 30ఏండ్లు ఆమెకు 27 రోజుల బిడ్డకూడా వున్నదని చెబుతున్నారు.

జీపు ప్రమాదంలో డ్రయివరు మృతి

గుంటూరు, అక్టో 24

చిలకలూరిపేట సబ్ ఇనస్పెక్టరు శ్రీ వై. కృష్ణమూర్తి జీపులో గుంటూరు వస్తుండగా రోడ్డు ప్రక్కనున్న కందకంలో జీపు పడిపోయింది- జీపు చక్రాలక్రింద నలిగిపోయి డ్రయివరు శ్రీ ఆవుల పోతరాజు వెంటనే మరణించాడు- శ్రీ కృష్ణమూర్తికి మెడ ఎముక విరిగింది- ఇంకా తీవ్రంగా గాయపడ్డారు- ఆయన్ని జనరల్ ఆసుపత్రిలో చేర్చారు- (స్వ- వి)

శ్రీ సంజీవయ్య నాయకత్వం

బలపరుస్తూ కరీంనగర్ కాంగ్రెసు కార్యకర్త ప్రకటన

కరీంనగరం, అక్టో 24

కరీంనగరము తాలూకా కాంగ్రెసు అధ్యక్షుడు పి. సి- సి- ప్రతినిధిఅగు శ్రీ బి. రాములు ఈ దిగువ ప్రకటన చేయుచున్నారు:

"నేటి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు రాజకీయాలను గమనించుచు కాంగ్రెసు సంస్థ శ్రేయస్సు దృష్టియందుంచుకొని గౌరవనీయ శ్రీ దామోదరము సంజీవయ్యగారినాయకత్వము వల్ల ముక్కోటి ఆంధ్రులుగల దేశములో ముఖ్యముగా హరిజన గిరిజన మరియు వెనుకబడిన వర్గాలకు ఎంతయో సహాయకారి కాగలదని ఆశించుచున్నాను. ఈ దృష్టితోనే నేను శ్రీ సంజీవయ్య ముఖ్యమంత్రిగారి నాయకత్వమును బలపరుస్తున్నాను. యిక ముందుకూడ శ్రీ సంజీవయ్య ముఖ్యమంత్రిగారి నాయకత్వమును బలపరచగలను".

కైరాన్ సహకార ధాన్యం మార్కెటు ప్రారంభోత్సవం

అంబాలా, అక్టో 23

అంబాలాకు పదిమైళ్ళ దూరాన గల పాబాద్ వద్ద 8 లక్షల ఖర్చుతో నిర్మించబడిన నవీన సహకార ధాన్యం మార్కెటుకు పంజాబ్ ముఖ్యమంత్రి సర్దార్ ప్రతాప్‌సింగ్ కయిరాన్ 22వ తేదిన ప్రారంభోత్సవం జరిపారు. ఈ మార్కెటుకు కైరాన్ పేరే ఉంచబడింది. ప్రారంభోత్సవ చిహ్నముగా మందుగుండు సామగ్రి పేల్చబడింది. కొత్త ధాన్యం అమ్మబడింది.

లియోపాల్డువిల్లీలో పౌరులు-సైనికుల ఘర్షణ

లియోపాల్డువిల్లీ, అక్టో 24

మొన్న రాత్రి పౌరులకు సైనికులకు మధ్య జరిగిన ఘర్షణలో చాలా మంది చనిపోయారనియు, కొందరు గాయపడ్డారనియు తెలియుచున్నది. కాంగో స్వాతంత్ర్యం యీ ఘర్షణానంతరం నిన్న లియోపాల్డువిల్లీ యందలి ఆఫ్రికా విభాగాన్ని వశపరచుకుంది. మెషిన్‌గన్‌లను ధరించి లారీలలోనున్న సైనికులు కేకలు వేయుచు, పెడబొబ్బలు పెట్టుచు ప్రజలలో భీతావహం కలుగజేశారు. అదే సమయంలో కల్నల్ మొబుటు శన సైనికులతో వాయవ్య దిశగా కోకీలావిల్లికి విమానంలో వెళ్ళారు సైనికులు నగరములో కొంతమందిని బంధించి లారీలలోకి ఎక్కించడమేగాక, గుర్తు పత్రాలను చింపి, పాదచారులను రైఫిళ్ళతో బెదిరించారు. తప్పత్రాగిన సైనికులు ఆఫ్రికా విభాగంలోకి ప్రవేశిస్తున్న యూరోపియన్‌లను ఆపి వారిని కార్లనుండి దిగిపోవునట్లు చేశారని గూడ తెలియుచున్నది. లీపోల్డువిల్లి పోలీస్ దళంగాని, అంతర్జాతీయ సైనికులుగాని ఎచ్చటనూ అగుపించలేదు. గత రాత్రి విశ్వవిద్యాలయ సమీపమున లుముంబాను బలపరచువారికిని సైనికులకు జరిగిన ఘర్షణలో 10 మంది మరణించినట్లు కామిటాటు గృహమునకు సహవాయిస్తున్న పోలీసులు తెలియజేశారు.

అబ్బాయపాలెం సమితి

సర్వసభ్య సమావేశం

హైద్రాబాద్, అక్టో 24

అబ్బాయపాలెంపంచాయతీసమితి, సర్వసభ్య సమావేశం అధ్యక్షులు శ్రీ ఆర్- సురేందర్ రెడ్డి అధ్యక్షతన మొన్న జరిగినప్పుడు సంచాయత్ రాజ్ దివస నిర్వహణ సంఘాన్ని 7 గురు సభ్యులతో ఏర్పాటు చేయటం జరిగినది. ఒక్కొక్క పంచాయత్ రు 25 రూపాయల ఉత్సవ సందర్భంలో ఖర్చుచేయ వచ్చునని గూడ నిర్ణయం చేయబడింది.

మహబూబాబాద్ బి. డి. ఓ. శ్రీ పన్నారెడ్డి గత 5 సంవత్సరాలలో జరిగిన వివిధ అభివృద్ధులను గూర్చి వివరించారు. 1960- 61 సంవత్సరానికై వీరిచే సమర్పించబడినరు. 4.97 లక్షల బడ్జెట్ మార్పులేకుండ ఆమోదింపబడినది.

అణ్వస్త్ర ప్రయోగాల నిషేధపుటొప్పందం

సమితిలో పోలెండు తీర్మాన ప్రతిపాదన

న్యూయార్క్, అక్టో 24

అణ్వస్త్ర ప్రయోగాలను ఆపివేసే విషయమై తూర్పు, పశ్చిమ రాజ్యాల మధ్య ఒప్పందానికి సంబంధించిన అంగీకారానికి 1961 ఏప్రిల్ 1 గడువుగా నిర్ణయించాలనిపేర్కొంటూగతరాత్రి పోలెండు ఐక్యరాజ్యసమితిలో ఒక తీర్మానం ప్రతిపాదించింది.

మెదక్ జిల్లాలో సహాయతా చర్యలకై 8న్నర లక్షలు

సంగారెడ్డి, అక్టో 24

మెదక్ జిల్లాలో వర్షాభావంవల్ల ఏర్పడిన కాటక పరిస్థితుల్ని తట్టుకోడానికి ఆలోచించబడిన వివిధ పథకాల్ని కలెక్టర్ శ్రీ టి.ఎన్. కపూర్ వెల్లడించారు.

సంగారెడ్డిలో అప్రోచ్ రోడ్లనిర్మాణానికై రు. 44720 లు ఆందోల్‌లో నిర్మాణాలకై 10 వేలు నర్సాపూర్ రోడ్లకై 4 లక్షలు జహీరాబాద్ నిమిత్తం రు. 1800, నారాయణఖేడ్‌లో రోడ్ల నిర్మాణానికి రు. 8588 లు కేటాయించబడినట్లా యన చెప్పారు.

ప్రభుత్వం నిర్ణయించిన వెంటనే రోడ్స్ డివిజన్ వారు పని చేపట్టగలరట.

మైనర్ ఇరిగేషన్ పనుల నిమిత్తం రు. 188400 వెరువుల మరమ్మతుకోసం రు. 125963 లు మంజూరు చేయబడినట్లు కూడా కలెక్టరు తెలిపారు.

మెదక్ జిల్లాలో చేపట్టబడే సహాయతా కార్యక్రమాల మొత్తం విలువ 8న్నర లక్షలు ఉండగలదని కూడా శ్రీ కపూర్ వెల్లడించారు.

చోరీ నేరానికి నాల్గు నెలల శిక్ష

రంగంపేటలోని ఎస్. దొడ్డమ్మ అను నామె యింట గత జులైలో చోరీచేసిన నేరానికి బండి దుర్గారావు అను నాతనికి మెదక్ మున్సిఫ్ మేజస్ట్రేట్ నాల్గు నెలల కఠినశిక్ష విధించారు.

భార్యముక్కు, కొప్పుకోసినభర్త

భార్య శీలాన్ని శంకించి రాయనపల్లిలోని బాలయ్య అను నాతడు భార్య నాయకమ్మ ముక్కు, కొప్పు కోసివేశాడు. ఈ సంఘటన అక్టోబరు 19 న జరిగింది. మెదక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్యారిస్‌లో అల్జీరియా విప్లవవాదుల అఘాయిత్యాలు

నల్గురి మృతి, 60 మంది అరెస్టు

ప్యారిస్, అక్టో 24

నిన్న అల్జీరియా విప్లవ వాదులు ఐదు పోలీసు స్టేషన్లపై దాడి జరిపిన సంఘటనల తరువాత ప్యారిస్ పోలీసు అధికారులు నగరంలోని ముస్లింపేటలన్నింటిని గాలించారు. మొత్తం 60 మంది నిన్న అరెస్టు చేయబడ్డారు.

ప్యారిస్‌లోను, లయాన్స్‌లోను అల్జీరియా విప్లవవాదులు నిన్న అనేక దాడులు జరిపినఫలితంగా 4గురు చనిపోయారు. 14గురు గాయపడ్డారు. ఈ విప్లవవాదులు చేతిబాంబుల్ని, మిషిన్ గన్‌లను వాడారుకూడా. ఈ విప్లవకారులు తుపాకీలు చూపి భయపెట్టి ప్యారిస్‌లోని కొన్నిటాక్సీలను వాడుకున్నారనికూడా తెలిసింది.

రాష్ట్ర సగర మహాసభ

హైద్రాబాద్, అక్టో 24

ప్రశాపగిరికోటలోనిన్న ప్రాంతీయ సగర ప్రతినిధుల మహాసభ జరిగి ఆంధ్రప్రదేశ్ సగర(ఉప్పర) మహాసభ ఏర్పాటైనది సభకు శ్రీ కె. వెంకటాచలం అధ్యక్షతవహించారు. ఈ దిగువవారు ఎన్నికయ్యారు:

వై. సత్యనారాయణ (అధ్యక్షుడు), ఆర్. గణపతిసాగర్, కె. రామస్వామి, కె. లక్ష్మీనరసయ్య (ఉపాధ్యక్షులు), సి. శ్రీరాములు (ప్రధాన కార్యదర్శి), బి. ఆంజయ్య, ఎస్. బలరాం (అర్గనైజింగు కార్యదర్శులు), జి. నారాయణ (కోశాధిపతి).

లేఖావళి

ఇల్లెందు మున్సిపాలిటీ పరిస్థితులు

ఆర్యా!

ఇల్లెందు పట్టణ కమిటీని కొత్త చట్టం ప్రకారం మున్సిపాలిటీగా ఏర్పాటు గావించాలని సంఘ సమావేశంలో తీర్మానించుకొనుట జరిగినది. కొత్త చట్టం ప్రకారం మున్సిపాలిటీగా ఏర్పడు అవకాశములు యీ సంఘమునకు లేకుండా లేవు. యీ సంఘ ప్రస్తుత జనాభా 10,500 వేలు, ఆదాయము సుమారు 60000 వేలు మాత్రం ఉంది. కొత్త చట్టరీత్యా జనాభా 15,000 వేలు, ఆదాయము 1,00,000 లక్ష ఉండాలి. ఆదాయము మరియు జనాభా లేని యీసమితి మున్సిపాలిటీగా ఏవిధంగా ఏర్పాటుఅవుతుందో అర్థంకాకుండా వుంది. వాస్తవముగా యీ సమితికి మేజర్ పంచాయతీగా మాత్రమే ఏర్పాటుకు అవకాశములు వున్నవి. ప్రస్తుత సమితి అధిపతులు జిల్లా పరిషత్తు అధ్యర్యమున ఉండుటకు సమ్మతిగా లేరు. రాజకీయములను దృష్టియందుంచుకొని సంఘ సమావేశములలో కొరగానితీర్మానములు గావించటం అందుకు కృషిసలుపుట న్యాయసమ్మతము కాజాలదు. యీ వ్యవహారాలను చట్టం అంగీకరించదు. సమితి నిర్వహణలలో రాజకీయములను ప్రవేశపెట్టుట చాలా పొరపాటు. చట్టరీత్యా జరుగు బాధ్యతలను అందరూ సమర్థిస్తూ సహకరించాలి. వ్యక్తి వ్యక్తి సమితిద్వారా సేవచేయుటకు మాత్రమే అలవాటుపడాలి. అందుకే సమితిలో సభ్యులుగా ఎన్నికైనట్లు భావించాలి.

కొంత మున్సిపాలిటీ ప్రాంతాన్ని సింగరేణి బొగ్గుగనుల మేనేజిమెంటు స్వాధీనపర్చుకొనుటకు సన్నాహాలు జరుగుచున్నవి. దీనికిగాను ఓవర్‌సీయర్‌లు మున్నగు వారంతా వచ్చి పరిశీలనలు జరుపుచున్నారు. సింగరేణి బొగ్గుగనుల మేనేజిమెంటు మున్సిపాలిటీ ఏరియాను స్వాధీనపరుచుకొనిన అనంతరం సమితి ఏరియా చాలా తగ్గిపోవుట మరియు జనాభా కూడా చాలా తక్కువ అవును. యిటువంటి పరిస్థితులలో లేని అవకాశములు కలవని మున్సిపాలిటీగా మాత్రమే ఏర్పాటు గావించాలని అనడం, ప్రభుత్వం తమ నిర్ణయాలు జరపకుండా అడ్డంకులు కల్పించటం ప్రజాప్రతినిధుల బాధ్యతలు కాజాలవు.

ఇల్లెందు సమితికి ఏ విధముగా చూచినా మేజర్ పంచాయతీగా ఏర్పడు అవకాశములు కలవు. జిల్లా పరిషత్తు ఆధ్వర్యమున ఉండిన ప్రజల సమస్యలు పూర్తిఅవుటకు కాలహరణ జరుగునని భావించగూడదు. పరిషత్తు ఆధ్వర్యమునే ఇల్లెందు సమితి పురోభివృద్ధికి మిక్కిలి అవకాశములు వుండుటయేకాక ప్రజల సమస్యలు పూర్తిగా వెంటవెంట జరుగునని ప్రభుత్వం చట్టరీత్యా సమితిని మేజర్ పంచాయతీగా ఏర్పాటు గావించాలని తెలియజేస్తున్నాను.

ఇట్లు
వై. రాములు
తాలూకా యువజన కాంగ్రెసు ప్రధాన కార్యదర్శి.

ఖమ్మంమున్సిపాలిటీలో ముసలం

ఆర్యా!

ఖమ్మం మున్సిపాలిటీలో కాంగ్రెస్ అధ్యక్షుని ఎన్నుకొన గలుగుటయే కొన్ని ప్రత్యేక పరిస్థితులలో తయారైంది. నాటి పి సి సి అధ్యక్షులు శ్రీ పిడతల రంగారెడ్డి అధ్యక్షుని

నవ్య సాహితీసమితి గ్రంథాలయ ప్రారంభోత్సవం

ప్రజల్ని ఉత్తమ సాహిత్య పఠనోన్ముఖుల్ని చేయాలని శ్రీ పండితారాధ్యుల నాగేశ్వరరావు ప్రసంగం

హైదరాబాద్, అక్టోబర్ 24

"గ్రంథాలయాలు పాఠకులకు చౌకపాటి సాహిత్యాన్ని అందించడము హర్షించతగిందికాదు. గ్రంథాలయాల నిర్వాహకులు సభ్యులకు పుస్తకాలు ఇండ్లకు పంపే ఏర్పాటు చేయటమేకాక సభ్యులు కానివారిని కూడా ఉత్తమ సాహిత్య పఠనోన్ముఖులను చేయడానికి కొన్నాళ్లపాటు వారికి ఉచితంగానే పుస్తకాలు ఇచ్చి ఆతరువాత వారినికూడ సభ్యులుగా చేర్పించుకోడము మంచిది. తద్వారా పుస్తకానికి అణా పారేసి చౌక బారు డిటెక్టివ్ సాహిత్యాన్ని చదివే దురలవాటునుఅరికట్టడానికివీలవుతుంది." అని ఆంధ్రభూమి సంపాదకులు శ్రీ పండితారాధ్యుల నాగేశ్వరరావు నిన్న ఉదయము చిక్కడపల్లిలో నవ్యసాహితీ సమితి గ్రంథాలయాన్ని ప్రారంభిస్తూ పేర్కొన్నారు.

ఈ సమావేశానికి శ్రీ వప్పు సోమసుందరం అధ్యక్షత వహించారు.

గ్రంథాల యోద్యమం మొదట్లో ఆంధ్రలోనే ప్రారంభమైనదనీ మనము చూచి దక్షిణాత్యులు ఈ ఉద్యమం ప్రారంభించి ముందుకు పోయారనీ నవ్యసాహితీ సమితివారు ఈ గ్రంథాలయము స్థాపించి చిక్కడపల్లిలో గ్రంథాలయము లేని కొరతను తీర్చడము ముదావహమని శ్రీ సోమసుందరం తమ అధ్యక్షోపన్యాసములో అన్నారు.

గ్రంథాలయ నిర్వహణతోగల సాధక బాధకాలను తెలుపుతూ బాలారిష్టాలు లేకుండా ఈ గ్రంథాలయము దినదినాభివృద్ధి చెందాలని ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయాధ్యక్షులు శ్రీ కోదాటి నారాయణరావు తమ శుభాకాంక్షలను తెలిపారు.

డా॥ వి. రామరాజు గ్రంథాలయ నిర్వాహకులు రచయితలను ఉచితముగా పుస్తకాలిమ్మని కోరడమువల్ల రచయితను ఇరుకున పెట్టడము అవుతుందనీ విరాళాలను, ఎక్కువగా సంపాదించి పుస్తకాలు కొనడము మంచిదనీ సలహా ఇచ్చారు.

శ్రీ ఇల్లెందలనరసింహారావుకూడా శుభాకాంక్షలు తెలిపారు.

ఈ గ్రంథాలయానికి దిగువ పాలకవర్గము తాత్కాలికంగా ఏర్పడింది:

అధ్యక్షులు: శ్రీమతి వి. రామలేపమ్మ, కార్యదర్శి శ్రీ అక్కిరాజు జనార్దనరావు, గ్రంథపాలకుడు శ్రీ మంజు, సభ్యులు: శ్రీ యుతులు జయంతి సత్యప్రభు, ఆర్. ఎస్. శాస్త్రి, ఆర్. సత్యనారాయణరావు, జి.ఎస్. ప్రకాశ్ రావు.

తేనేటి విందుతోను, శ్రీ సత్యప్రభు కృతజ్ఞతాభి వందనలతోను సమావేశము ముగిసింది. (ఓ. వి)

దీపావళి కవితాగోష్ఠి

బందరు, అక్టోబర్ 24

ఆంధ్ర కేసరి హాలులో శ్రీ పెనుమర్తి లక్ష్మీపతిశాస్త్రి అధ్యక్షత క్రింద దీపావళి కవితాగోష్ఠి జరిగెను. అందు కవికోకిల శ్రీ కృత్తివెంటి వెంకటేశ్వర్రావు తానురించియించిన "కలాదరం" గల్లి" తదితర రచనలు వినిపించిరి. తర్వాత విద్వాన్ శ్రీ చిట్టా రామకృష్ణశాస్త్రి దీపావళి, ఆంధ్ర ప్రసక్తి అను విషయములు గురించి కావ్యగానము చేసిరి. (స్వ. వి)

మొబుటు 'న్యూయార్క్ ప్రయాణం

సమితి అధికార వర్గాలకు వర్తమానమేమీ లేదట

న్యూయార్క్, అక్టో 24

కాంగో పరిస్థితిపై హామర్షెల్డుతో చర్చించడానికి కర్నల్ మొబుటు న్యూయార్క్‌కు రాగలడన్న విషయంపై యిప్పటికీ తమకేమీ అధికార వర్తమానం అందలేదని సమితి ఉన్నతాధికార వర్గాలవారు గతరాత్రి తెలిపారు. హామర్షెల్డు ప్రతినిధి లియొపాల్డువిల్లోని తన ప్రతినిధి శ్రీ రాజేశ్వరదయాళ్‌తో కేబుల్ ద్వారా మాట్లాడుతూ వర్తమానాలు తెలుసుకుంటూనే ఉన్నాడు. అయితే మొబుటు, దయాళ్‌ల మధ్య అవిశ్వాసాన్ని గురించినవిషయాన్ని అధికార వర్గాలు ధ్రువపరచలేదు.

మల్కాజ్‌గిరిలో జలశాల ప్రారంభోత్సవం

సికింద్రాబాద్, అక్టో 24

మల్కాజ్‌గిరి గ్రామములోని మాధ్యమిక పాఠశాలలోని దండు అగయ్య మాధ్యమిక విద్యాకమెటీ వారి అధ్వర్యాన పాఠశాల ఆవరణలో శ్రీ అమ్మనబోలు రాజయ్యచే నిర్మింపబడిన జలశాలకు జిల్లా పరిషత్ అధ్యక్షులు శ్రీ డాక్టర్ లక్ష్మీనరసయ్యచే ప్రారంభోత్సవము 23 వ తేదీ ఆదివారంనాడు జరుపబడింది. సభకు మాజీమేయర్ శ్రీ అనంతుల రంగపాండు అధ్యక్షత వహించారు. సభలో హయత్‌నగర్ సమితి అధ్యక్షులు శ్రీ యస్. మధుసూదనరెడ్డి శ్రీ వి. సుబ్బయ్య జలశాల ఆవశ్యకతను గురించి మాట్లాడినారు. యీ జలశాల సుమారు 600 లమంది విద్యార్థులకు, బాటసార్లకు నీటి వసతి కలిగించగలదు. పాఠశాల విద్యార్థులందరకు మిఠాయిలు పంచబడ్డాయి. ప్రధానోపాధ్యాయుల వందనసమర్పణంతో సభ ముగిసింది.

అచ్చంపేటబ్లాక్ ముందడుగు

వివిధపథకాలతో నిర్వహణకృషి

మహబూబ్‌నగర్, అక్టో 24

28 మంచాయతి సంఘాలు ఒక బ్లాక్ మున్సిపాలిటి గల అచ్చంపేట బ్లాక్ మొదటి దశ పంచాయత్‌సమితి బ్లాక్‌గా మార్పునయినది. ఈబ్లాక్‌లో 848 మణుగుల విత్తనాలు, 886 మణుగుల రసాయనిక ఎరువులు రయితులకు పంచిపెట్టారు. దాదాపు 800 ఎకరములు జపానీ పద్ధతి సాగులో తేబడింది. పశుగణాభివృద్ధిక్రింద 126 పశువుల నేరు కొట్టారు.

ఉప్పు నూతల గ్రామంలో వైద్య కేంద్రాన్ని నెలకొల్పుటకు రు. 5000 పొగరాని పొయ్యిలు, మరుగుదొడ్ల నిమిత్తం మరో రు. 5000 గ్రామస్థులు సమకూర్చారు. సహకార గీతపారిశ్రామిక సంఘాలు పలుచోట్ల యేర్పాటు చేయనయినవి.

పొల్కంపల్లి, పులిజాల, తుమ్మనపేట, బిల్మార్, పొల్సెట్టిపల్లి, రంగాపురములందు 118 సభ్యులుగలయువక సంఘాలు నిర్వహించబడినవి. లక్నారం, కోడంగల్ నందు కమ్యూనిటి రేడియోలు స్థాపించబడినవి. కమ్యూనిటి రేడియోలకైరాకొండ, జిన్కుంట, దాసర్లపల్లి, నడింపల్లి గ్రామాలలో డబ్బు ప్రోగు చేశారు. గ్రంథాలయాలు, పిల్లల ఆటస్థలాలు గూడ గ్రామాలందు స్థాపించుటకు యత్నములు జరుగుచున్నవి.

సమితి పక్షమున రాష్ట్రాభివృద్ధి అప్పుకై రు. 500 పొదుపుఉద్యమంలో రు. 1270 ప్రోగుచేశారు.

ప్రస్తుతం నిర్వహింపబడుచున్న పనులే గాక యింకా ఎన్నో అభివృద్ధి పనులనునిర్వహించ సమితితలపెట్టింది.

హైదరాబాదు డి. సి. సి. సభ్యులచే మేడ్చెల్ గ్రామాల పర్యటన

హయిద్రాబాద్, అక్టో 24

హైదరాబాద్ డి. సి. సి. కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ కె. సత్యనారాయణ రెడ్డి; డా॥ ఎం. చెన్నారెడ్డి తదితరులతో కలిసి మేడ్చెల్ తాలూకా గ్రామములలో 21 నుండి 23 అక్టోబర్ వఱకు పర్యటించారు. వీరు దర్శించిన గ్రామాలలో బహిరంగసభలందు ప్రసంగిస్తూ కాంగ్రెస్ పార్టీలో ప్రజలు అధిక సంఖ్యలో చేరి సంస్థను బలపర్చవలసిందిగా కోరారు. కాంగ్రెసు కార్యకర్తలు గ్రామోద్ధరణపనులందు అవిరామంగా కృషిచేసి గ్రామీణుల జీవన పరిమాణాన్ని అభివృద్ధి చేయాలని హితబోధ చేశారు. వీరు పర్యటించినపలుగ్రామములందుగ్రామ కాంగ్రెస్ సంఘాలను కూడ స్థాపించారు. పెక్కుచోట్ల గ్రామీణులు తమ కష్టనిష్ఠురాలనుగూర్చియు, అవసరాలను గూర్చియు వీరికి తెలియజేశారు.

పంచమ హిందుస్తానీ ఫిల్మ్‌పాటలపోటి

హైదరాబాద్, అక్టో 24

లలితకళల అకాడమి అధ్వర్యమున నిర్వహింపబడు పంచమ హిందూస్తానీ ఫిల్మ్ పాటల పోటిలో పాల్గొనుటకు ప్రవేశపత్రములు 25 అక్టోబర్ 60 లోగా అందవలెను. 27 అక్టోబర్ సాయంత్రం 6 నుండి 8 గంటలవరకు మోజంజాహిమార్కెట్ నందలిబ్యాచ్‌లర్స్ క్వార్టర్స్ గదినం. 27 లో అభ్యర్థుల ఎన్నికయి పోటీ జరుపబడును.

గొప్పవేలం అమ్మకము

మాసాబ్ టాంక్ ప్రదేశములో ఆరోగ్యప్రదమైన వాతావరణముతో గలిగి, నవాబ్ హిమాయత్ నవాజ్‌గంజ్ మరియు పోలీసు ఆఫీసర్స్ మెస్‌లకు మధ్యనగల రెండంతస్తుల అందమైన బంగ్లా ఖాళీగా వున్నదానిని.

6-11-1960 ఆదివారం ఉ॥ 10-0 గం॥ వేలం వేయబడును.

ఈ బంగ్లా ఆధునాతన వసతులతో అనేకమైన గదులు, హాల్స్, వరండాలు, స్నానాల గదులు, విడి ఇండ్లు గలిగి, నల్లా, లైటు, ఫ్లష్ మున్నగు సౌకర్యములతో అందమైన దానిని మాచే ఎక్కువ పాటదారుపేర అమ్మబడును.

వివరములుగల కరపత్రములు పంచిపెట్టబడుచున్నవి.

జె. మూసా & సన్స్
గవర్నమెంట్ అండ్ బోనఫైడ్ పబ్లిక్ అక్షనీర్స్
దివాన్ దేవిడి ఫోన్: 5111

"సదరన్ రోడ్‌వేస్
పార్శెల్ సర్వీస్ ఎంతైనా
నమ్మదగినది"





అవధి

మీ సరకులు పలుచోట్లకు వివిధ ప్రదేశాలకు వెళ్లవలసిన ఔషధములైతే టి వి యస్ సదరన్ రోడ్‌వేస్‌వారి ఆశ్రయం ఉంది మీకు. దినసరి 19254 మైళ్లు దూరము 57 మార్గాలలో 111 లారీల పెద్ద సమూహము స్రోత్ ఇండియాలో మూల మూలలకు చేరతాయి

టివియస్ రోడ్‌వేస్ పార్శెల్ సర్వీస్ ఈ ఇతర లాభాలను కలుగజేస్తుంది.

★ ప్రత్యేక శిక్షణను పొందిన సిబ్బంది సరకులను ఎత్తి దింపుతుంది.
★ స్టేషనును విడిచే ముందు ప్రతిలారీ తూకం చేయబడును.
★ ప్రతిలారీ నిరపాయకరమైన ఒకే వేగంలో నడపబడును.
★ లారీలు రక్షక టైము షెడ్యూలును అనుసరించును.
★ సరకులు ఒట్వాడా అయేవరకు మీ సరకులను అతి జాగ్రత్తగా 307 స్టేషనులలోనుగల గిడ్డంగులలో భద్రపరచెదరు.
★ మీకు కావలసినప్పుడు లారీని ఏర్పాటు చేసుకోవచ్చు.

సదరన్ రోడ్‌వేస్ దక్షిణ ఇండియాలో బృహత్తర మార్గజాలము

మీ పార్శెలును చంటి బిడ్డలా చూసుకుంటాం

సదరన్ రోడ్‌వేస్ ప్రైవేట్ లిమిటెడ్, మధురై
(టివిఎస్ యూనిట్)



33 వ సంయుక్త వారం
గురుదత్ సమర్పించు
చౌధ్వీకా చాంద్
ప్రభాత్ హైదరాబాద్.
ఆటలు: 6-30, 9-30. గం॥
హెచ్చు తరగతులకు అడ్వాన్సు బుకింగ్.
- జ్యోతి డిస్ట్రిబ్యూటర్స్ రిలీజ్
(Trupix)

13 వ సంయుక్త వారము
జోహార్ ఫిలిమ్స్
బేవఖూఫ్
తా॥ కిషోర్‌కుమార్, మాలాసిన్హా, ప్రాణ్, ఐ. ఎస్. జోహార్.
లిబర్టి
హైదరాబాద్
ఆటలు: 6-30 మరియు 9-30.
హెచ్చు తరగతులకు అడ్వాన్సు బుకింగ్.
శ్రీ సినీ కార్పొరేషన్ విడుదల
(Trupix)

ఆకాశవాణి

హైదరాబాద్-ఎ

405.4 మీ (740 కిలోసై)

బుధవారం అక్టోబర్ 26

ఉ॥ 6-30 సుప్రభాత్, కార్యక్రమ వివరణ, 6-40 భక్తిరంజని, 7-00 తె-వా, 7-15 వి.వి. నీలారాయ్: వీణ 7-45 సంగీత శిక్షణ, 8-00 ఆం-వా, 8-15 హిం-వా, 8-30 హిందూస్థానీ సంగీత శిక్షణ, 8-45 ప్రసార సమాప్తి

మ॥ 12-30 కార్మికులకార్యక్రమం (విజయవాడ నుండి రిలే), 1-00 మహిళా సమాజం, 1-30 లయవిన్యాసము (నిలయ విద్వాంసులు), 1-50 తె-వా, 2-00 అలీఅక్బర్ ఖాన్:సరోద్ 2-10 ఉ-వా, 2-20 ఉన్నత పాఠశాలలకు (ఉర్దూ), 2-50 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

3-45 ఉన్నత పాఠశాలలకు, 4-15 ప్రసార సమాప్తి.

సా॥ 6-00 స్థానికప్రకటనలు, 6-05 ప్రాంతీయ వార్తలు, 6-15 బిందగీతకినారే నాటిక (ఉర్దూ), 7-00 తె-వా, 7-15 ఆదాన్‌ప్రదాన్, 7-30 రేడియో వార్తావాహిని, 7-40 విరామసంగీతం: 7-45 ఆంధ్రిలోఅటవీ సంపద ప్రసంగము సి.వి, కొండారెడ్డి 7-55 డాక్యుమెంటరి చిత్రాల సమీక్ష 8 00 మద్రాస్ బి వలె, 8-30 శంకర్రావు:సితార్, 8-45 కమలా దేవి ధన్‌శ్రీ, 9-00 ఆం-వా, 9-15ఉ-వా, 9-30 ఢిల్లీ నుండి రిలే, 9-50 శంకరరావు: సితార్, 10-00 కమలాదేవి ధన్‌శ్రీ, 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

హైదరాబాదు - బి

ఉ॥ 6-30 హైద్రాబాద్ ఎ వలె, 8-45 ప్రసార సమాప్తి.

మ॥ 12-30 హైదరాబాదు ఎవలె, 2-00 వి: అంకయ్య, 2-50 వాతావరణ సూచన, ప్రసారసమాప్తి.

3-45 హైదరాబాద్ ఎ వలె,4-15 ప్రసార సమాప్తి.

సా॥ 6-00 హైద్రాబాద్ ఎ వలె, 6-15 గ్రామస్థుల కార్యక్రమము, 7-00 తె-వా, 7-15 గ్రామస్థుల కార్యక్రమము, 7-30 హైద్రాబాద్ ఎవలె, 9-00 ఆం-వా, 9-15 సంగీత నాటక శిక్షణ, 9-30 హైద్రాబాద్ ఎ వలె, 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

విజయవాడ

357.1 మీ (840 కిలోసై)

ఉ॥ 6-30 శుభోదయం, ప్రసార విశేషాలు, 6-40 భక్తిరంజని, (హైదరాబాద్ నుండి రిలే), 7-00 తె-వా, 7-15 హైద్రాబాద్ ఎ వలె, 7-45 సంగీత శిక్షణ, 8-00 ఆం-వా, 8-15 హిం-వా, 8-30 ప్రసార సమాప్తి.

మ॥12-30 కార్మికుల కార్యక్రమం ఊగింది ఉయ్యాల రికార్డులతో కూర్చిన రూపకము, 1-00 మహిళాసమాజము (హైద్రాబాద్ నుండి రిలే), 1-30 అకెళ్ళ ప్రభాకరమూర్తి, 1-50 తె-వా, 2-00 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

3 30 వాద్యసంగీతం, 3-45ఉన్నత పాఠశాలలకు (హైద్రాబాద్ నుండి రిలే), 4-15 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

సా॥ 6-00 స్థానికప్రకటనలు, 6-05 ప్రాంతీయ వార్తలు, 6-15 గ్రామస్థుల కార్యక్రమము, 7-00 తె- వా, 7-15 గ్రామస్థుల కార్యక్రమము, 7-30 రేడియో వార్తావాహిని (హైద్రాబాద్ నుండి రిలే), 7.40 లలితసంగీతం ఎస్. రాధాబాయ్, 8-00 ఉన్నతోద్యోగాలు నాటిక (మద్రాస్ నుండి రిలే), 8-30 వాద్య సంగీతం, 9-00 ఆం-వా, 9-15 లలిత సంగీతం: ఎస్. రాధాబాయ్, 9-30 ఢిల్లీ నుండి రిలే, 9-50 అకెళ్ళప్రభాకరమూర్తి, 10-30 వాతావరణసూచన, ప్రసారసమాప్తి.

ఏనుగ స్వైరవిహారం

పాట్నా, అక్టోబర్ 24

నిన్న ఉదయము ఒక పెద్ద ఏనుగు ఆహారముకోసము వెతుకుతూ బిహార్ ఇంజనీరింగ్ కాలేజి ద్వారాన్ని పడద్రోసి ఆవరణలో ప్రవేశించి అక్కడ నిద్రిస్తున్న కావరులను యితరులను భయభ్రాంతుల్ని చేసింది. ఈఏనుగు సోనేపూర్ సంతకై తేబడుతుండగా పాట్నాలో మావటివాడు నిద్రిస్తున్న సమయములో కట్టుత్రెంపుకొని ఊరి మీద పడింది.

ఇంజనీరింగ్ కాలేజి ప్రిన్సిపాల్ డా॥ డి. ఎన్. సింగ్ పోలీసుల్ని పిలిపించారు. కాని వారు ఏనుగును స్వాధీనము చేసుకోలేక పోయారు. చివరకు అంతా వెళ్ళి మావటి వానిని తోడి తీసుకువస్తే ఆ ఏనుగు తగ్గింగి వచ్చింది.

వాటేజు వాసవారాలు

మెసర్స్ కల్వసూర్యనారాయణ సర్వంట్ అండ్ కమిషన్ ఏజంట్
ఉస్మాన్‌గంజ్-హైద్రాబాదు
ఫోన్ నెం. 4412
హైదరాబాద్, అక్టోబర్ 22
(క్వింటల్ ధరలు)

	రు, న, రు. 0.
నానకరాంలు	57-10 62-50
గర్కలు	54-50 56-30
పాలకుర్కులు	58-01 60-75
24 నంబర్లు	64 30 66-90
బంగారుతీగెలు	61-65 66-10
గుజ్జులు	61-65 63-40
గొట్టెవియ్యం	50-95 52-60
కుసుమవియ్యం	58-90 60-75
దొడ్డు విత్యం	55-40 57-60
నెంబర్లు గో॥	58-10 60-30
సాంబర్లు పా॥	
కొత్తసాంబర్లు	64-20 73-50
నూకలు	39-30 49-15
బ్రిగోధుమలు	58-00 64-50
ఎర్రగోధుమలు	48-50 53-20
పరబతీ గోధుమలు	67-30 70-55
కుస్సులు	66-95 68-75
కందులు పెద్దవి కొ॥	44-60 48-35
కందులు చిన్నవి కొ॥	41-10 43-20
మినుములు	43-75 48-00
పెసలుకొ॥	44-60 47-95
శెల్లం	35-75 53 50
పెసళ్ళు పా॥	42-85 45-10
తెల్లజొన్నలు	44.65 46-90
పచ్చజొన్నలు	
చపిటి జొన్నలు	
మిరపకాయలు	120-00 225-00
పసుపు	110-00 123-00
ఉల్లిగడ్డ కొ॥	15-00 23-00
చింతపండు కొ॥	55-00 100-00
శెల్లనువ్వులు	116-00 126-00
సద్దలు	39-30 40-20
పెద్ద కందిపప్పు	66-10 71-45
చిన్న కందిపప్పు	58-10 62-50
పెసరపప్పు	53-10 55-40
శనగలు	45-55 47-33
పెసరపప్పు	60-75 61-65
మినుప పప్పు	62-55 64-00
అముదాలు	64-30 66-10
అంకపప్పు	38-40 39-30
ఇలాతికాయ చి॥	75-00 85-00
అల్లం	
యిల్లిగడ్డ	35-70 45-00
పల్కుమ ఎ	20-50 21-00
పత్తిగింజలు	28 30 35-70

షిల్లాంగ్‌లోహర్తాలునకై పిలుపు

ప్రదేశ్ కాంగ్రెస్ ప్రతిపాదన శాసనసభ కాంగ్రెస్ పక్షంచే నిరాకరణ

షిల్లాంగ్, అక్టో 24

బెంగాలిమాటలాడు కచార్ జిల్లా యందలి మోహర్రోమా పరిషత్తునకు జిల్లా పాలనయందు భాష మార్పునకై యిచ్చిన అధికారమును తొలగించవలెనని ఈమధ్య జరిగిన అస్సాం ప్రదేశ్ కాంగ్రెస్‌కమిటీ చేసిన ప్రతిపాదనను శాసనసభ కాంగ్రెస్ పక్షం మూడు రోజుల చర్చానంతరం గతరాత్రి 32-12 ఓట్లతేడాతో నిరాకరించింది. ఇట్టి అవకాశం పౌరులను వర్గీకరించటమేకాక రాజ్యాంగచట్ట విరుద్ధమని అస్సాం ముఖ్యమంత్రి శ్రీ బి.పి చాలిహా ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ సిద్ధినాథ్ శర్మకు వ్రాసినజాబులో పేర్కొన్నారు. నిన్న రాత్రి ప్రొద్దుపోయేవరకు రాష్ట్రమంత్రివర్గం యీ పరిస్థితులను గూర్చి చర్చించింది.

శాసన సభా సమావేశంలో పక్షత్వంచే ప్రవేశపెట్టబడిన ద్విభాషా బిల్లు క్లాజువారీగా చర్చింపబడుతుంది. ప్రదేశ్ కాంగ్రెసు గతవారం శ్రీకారానించిన ప్రకారం కేవలం అస్సామి రాష్ట్రభాషగా ఉండాలనియు, జిల్లా స్థాయిలో వివిధభాషలకు అవకాశము కల్పించాలనియు పెక్కు కాంగ్రెసు సభ్యులు ప్రతిపాదనలు పంపారు.

బిల్లు వివిధ విషయాలపై తను అభిప్రాయాలనుప్రకటించుటకు వాక్స్వాతంత్ర్యం, ఓటు చేయుటలో స్వేచ్ఛ కచార్ కాంగ్రెసు అభ్యర్థులకు ఇవ్వబడినదని తెలుస్తున్నది. ఈ సభ్యులు బెంగాలీభాషను అస్సామిభాషస్థాయిలోనే చూడాలనియు. మోహర్రోమా పరిషత్తుల కధికారం కల్పించుక్లాజును బిల్లునుంచి తొలగింపవలెననియు కోరినారు.

పర్వత నాయకుల అన్నిపక్షముల చర్యాసమితి సమావేశం పూర్తి బిల్లునే వ్యతిరేకించింది. బిల్లును వ్యతిరేకిస్తూ 26 వ తేదీన షిల్లాంగులో హర్తాల్ చేయుటకై ఈసమితి పిలుపు గూడా యిచ్చినది.

నగర వార్తలు

హిందీప్రచారసభ సమావేశం వాయిదా

కొత్త నియమావళిని ఆమోదించుటకు ఈనెల 31వ తేదీన జరుగవలసిన హైద్రాబాదు హిందీప్రచారసభ సర్వసభ్య సమావేశము వాయిదా వేయబడినది. దీపావళి సెలవుల తరువాత వారి బళ్ళు అక్టోబరు 31న తెరువబడుచున్నవి కాబట్టి వారికి ఈ సమావేశం అనుకూలముగా వుండదు. కావున దీనిని వాయిదా వేయాలని కొందరు ఉపాధ్యాయ సభ్యులు కోరిన మీదట ఈ మార్పు జరిగినది.

'ఆంధ్ర విశ్వసాహితి' సంస్థ ఏర్పాటు

తెలుగు సాహిత్యాన్ని ఇతర భాషల్లోకి అనువదింపజేసి ప్రాచుర్యానికి తేవాలన్న ఆశయము ప్రకారం సికింద్రాబాదులోని వాణీ గ్రంథమాలను (1957లో స్థాపితం) ఆంధ్ర విశ్వసాహితి అను సంస్థగా పునర్నిర్మించారు. ఇంగ్లీషు, హిందీ, తదితర భారతీయ విదేశీయ భాషల్లోకి తెలుగు సాహిత్యాన్ని అనువదింపజేయడము సాహిత్య సాంస్కృతిక నాటక సంస్థలకు సహాయపడడం తెలుగు ప్రజల్లో పఠనాసక్తి కొనుగోలు తత్వం పెంపొందించడము ఆశయాలు గా గల యీ ఆంధ్ర విశ్వసాహితికి అధ్యక్షుడుగా శ్రీ పోతుకూచి సాంబశివరావు, కార్యదర్శిగా శ్రీ ఇ. సుబ్బారావు, కోశాధిపతిగా శ్రీ జి. ఎస్. ప్రకాశరావు వ్యవహరిస్తారు. మరో ఐదుగురు కార్యవర్గ సభ్యులెన్నికవుతారు. ప్రముఖులతో సలహా సంఘము ఒకటి పనిచేస్తుంది. దీని కార్యాలయం 208. లోయిగూడా, సికింద్రాబాదులో ఏర్పాటైంది.

వెండి, బంగారు ధరలు

సముద్రాల రాఘవులు గారి చంద్రయ్య దుకాణం

సిద్దంబర్ బజారు, ఫోన్ నెం. 4890

హైదరాబాద్, అక్టో 24

బంగారం	134 62
అశోక్ చిప్	134.75
సవరన్	87.00
వెండి 100 తు॥	220.00
చిల్లర	2.25

మీ ఊహాగానముకంటె ఉన్నతమైన గాథా చిత్రము.
ఇంపైనపాటలు, సొంపైన నృత్యములకు
అశోక్ పిక్చర్స్
కల్పన



తా॥ అశోక్‌కుమార్, పద్మిని, రాగిణి, ఎస్. నజీర్, సుందర్, అచలసహదేవ్ తదితరులు.

దర్శకత్వం: రాఖన్. సంగీతం: ఓ. పి. నయ్యర్.

తేదీ, థియేటర్లకై నిరీక్షించండి!

(Trupix) —జగత్ పిక్చర్స్ విడుదల.

8 వ సంయుక్త వారము
పి. వి. వి. యస్. యం. వారి
భట్టి విక్రమార్క (తెలుగు)
దీపక్ మహల్ హైదరాబాద్. అజంతా సికింద్రాబాదు.
నేడు 2 ఆటలు: 6-00, 9-30 గం॥
రాజరాజేశ్వరి-వరంగల్ శ్రీప్రభాత్-నిజామాబాద్.
హెచ్చు తరగతులకు అడ్వాన్సు బుకింగ్.
(Nima) —అమర్ పిక్చర్స్ విడుదల.

నేడే చూడండి! ముచ్చటైన మూడవ సంయుక్త వారము
మదిని రంజింపచేయు మందయానల మధుర చిత్రము.
మహేశ్వరి ప్రొడక్షన్స్ వారి
రమా సుందరి

తా॥ కృష్ణకుమారి, గిరిజ, కాంతారావు, రామకృష్ణ, బాలకృష్ణ, రాజసులోచన.
రాజేశ్వర్ - సికింద్రాబాదు
2 ఆటలు: 6-00 మరియు 9-30 గం॥ —శ్రీ ఫిలిమ్స్ రిలీజ్

నేటి రాత్రి నేటి రాత్రి
శ్రీ విశ్వభారతి ఫిలిమ్స్: "బర్సాత్‌కిరాత్"
జమ్ ఖుద్ - హైద్రాబాదు.
నేడు 3 ఆటలు: 3-30, 6-30, 9-30.
అశోక్ & మనోహర్
హైద్రాబాదు సికింద్రాబాదు.
నేడు 2 ఆటలు: 6-30 మరియు 9-30 గం॥
(Trupix) విజయా డిస్ట్రిబ్యూటర్స్ విడుదల

నల్గొండ జిల్లాలో సహాయతా కార్యక్రమాలు

కలెక్టర్ చేవివరణ

నల్గొండ, అక్టో 24

గత వారం జరిగిన రెవిన్యూ ఆఫీసర్ల సమావేశమునకు అధ్యక్షత వహించిన నల్గొండ జిల్లా కలెక్టర్ శ్రీ అల్లాయార్ ఖాన్ సహాయతా కార్యక్రమాల అభివృద్ధినిగూర్చి వివరిస్తూ జిల్లాపరిషత్తు, పంచాయత్ సమితులు సహాయ కార్యక్రమంక్రింద రోడ్లు నిర్మించుటకై రు. 1.89లక్షలు ప్రత్యేకించబడినవని తెలియజేశారు. ఇప్పటికే సమితి ప్రాంతాల్లో 106రోడ్లు, బ్లాక్ ప్రాంతాల్లో 86రోడ్లు వేయబడుచున్నవనీ, 75 చౌకదుకాణములు తెరవబడినవనీ, ఆయన చెప్పారు. కరువుపరిస్థితుల దృష్ట్యా యితవరకు అంగీకరించబడిన 150 బావులేగాక రు. 4.5 లక్షల వ్యయంతో యింకా 600 బావులు త్రవ్వుటకు గ్రాంటు మంజూరైనదని, అట్టి డబ్బును అర్హులైన రైతులకు శీఘ్రంగా యివ్వవలెననీ అన్నారు. చిన్నతరగతిచెరువులను బాగుచేయుటకు, వాటినిమంచిస్థితిలో నుంచుటకు రు. 1.25 లక్షలుగూడ మంజూరుచేయబడినట్టు వీరు వివరించారు. 1960-61 సం॥నకు జిల్లాయందు పొదుపుఉద్యమంలో రు.3.1లక్షలు సమకూర్చాలని నిర్ణయిస్తే యింతవరకు రు. 2.17 లక్షలు వసూలయ్యాయట. భూమిపంపకం, హక్కెమాలికాన, జనాభాలెక్కల సేకరణ పనులను గూర్చియుకలెక్టర్ వివరించారు.

ఎ.ఐ.సి.సి. సమావేశ మండప నిర్మాణం

30 వేల మందికి వసతి సౌకర్యాలు

రాయపూర్, అక్టో 24

రాబోవు ఎ. ఐ. సి. సి. సమావేశ ఏర్పాట్లు పూర్తి కావస్తున్నవి. 30వేల మందికి వసతి కల్పించే మండప నిర్మాణం పూర్తయినది. కాని, దానిలోపలి అలంకరణ పూర్తి చేయుటకు రాత్రింబగళ్ళు పనిజరుగుచున్నది. రవిశంకర్ శుక్లా నగర్ వద్ద బహుకోణ చిత్ర వర్ణ ముఖద్వారము పెద్దఏనుగల ఆకృతులతో కూడిన గజ ద్వారము పూర్తి కావస్తున్నవి. జాతీయ నిర్మాణ కృషిలో వారి పాత్రను తెలిపేరెండు పెద్ద కార్మిక విగ్రహాలు వారి కృషి గౌరవసూచకంగాప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ తో నిర్మింపబడి సమావేశం జరుగు శుక్లానగర్ ముఖ్య ద్వారాలవద్ద వుంచబడును. వీటికి స్థానిక ప్రాధాన్యత కొనగుటకు చత్రీస్‌గర్, కొండ ప్రాంత కార్మికుల రెండు జీవప్రమాణ విగ్రహాలు కూడ నిర్మించబడుచున్నవి.

సేవాగ్రామ పద్ధతి గుడిసెలో జీవప్రమాణ గాంధీజీ విగ్రహ మొకటి చరఖాపడుకుతున్నట్లు, శుక్లానగర్‌లో నిర్మింపబడుట మరొక ఆకర్షణ.

అహ్వాన సంఘంవారు యేర్పాటు చేసే అభివృద్ధి ప్రదర్శనలో ప్రభుత్వ రంగంవారు నెలకొల్పే స్టాళ్లతోపాటు 125 ప్రైవేట్ పెట్టుబడిదార్లు కూడ వారివారిస్టాళ్లను నెలకొల్పుచున్నారు

ఎ. ఐ. సి. సి. సమావేశ సందర్భములో కాంగ్రెస్ మండపానికి వెళ్ళే ముఖ్యమార్గాలను చిత్రవర్ణ ట్యూబ్ లైట్లతో వెలిగించుటకు రాయ్‌పూర్ మునిసిపాలిటీవారు నిశ్చయించారు.

సర్వోదయకార్యకర్తలఉపవాసం

ఈ ఎ. ఐ. సి. సి. సమావేశాల సందర్భంలో సర్వోదయ కార్యకర్తలు స్వీయ పవిత్రతకొరకు మూక ఉమ్మడిగా ఉపవాసాలను జరిపి, అదే సమయంలో అఖిలభారత సత్యాగ్రహ సమాజాన్ని ఏర్పాటుచేసే నిర్ణయాన్ని గైకొనెదరనీ, ప్రస్తుత పార్టీ వ్యవస్థలో కడగండ్ల పాలగుచున్న జనబాహుళ్యానికి తగు ప్రతిపత్తిని తెచ్చేది కేవలం పార్టీరహిత ప్రజాస్వామ్యమేనని, ఈ ఆదర్శ సిద్ధికొరకే సత్యాగ్రహ సమాజం కృషి సల్పగలదని మూక ఉమ్మడి ఉపవాసఉద్యమానికి నాయకత్వము వహించే దాక్షిణాత్య సర్వోదయ నాయకుడు శ్రీ గోరా విలేఖరులతో నేడు యిచట అన్నారు.

ఈ ఉపవాస దీక్షలో 3 వందల మంది సర్వోదయ కార్యకర్తలు పాల్గొనెదరని నిర్వాహకుల అంచనా.

ఈ సమావేశ సందర్భంలో ప్రధాని నెహ్రూ ముందు చత్రీస్‌గర్ గిరిజనులు ఒక ప్రదర్శన జరుపనున్నట్టు తెలుస్తున్నది.

ఈ ప్రదర్శనను యేర్పాటుచేస్తున్న మధ్య ప్రదేశ్ కిసాన్ సంఘముచారు, వ్యవసాయదార్లకు హాని కలిగిస్తున్న "మధ్యప్రదేశ్ లియ్యం ఎగుమతిచేయ కూడదన్న నిర్బంధా"న్ని తొలగించవలసినదిగా కోరుతూ ప్రధానికి ఒక మెమోరాండంను సమర్పించగలరు.

శబల సుందరమైన వాతావరణంలో భారతీయ సాంప్రదాయానుసారంగా, విశ్వభారతి స్నాతకోత్సవాలు ప్రతిపటా జరుగుతవి. కొంత కాలంక్రితం జరిగినస్నాతకోత్సవంలో న్యాయమూర్తి రామప్రసాద్ ముఖర్జీ నుంచి ఒక బాలిక డిప్లొమా పుచ్చుకుంటున్న దృశ్యం.

దక్షిణజోనల్ కౌన్సిల్ సమావేశం

డిసెంబరు ప్రారంభంలో మద్రాసులో ఏర్పాటు

హైద్రాబాద్, అక్టోబర్ 24

దక్షిణజోనల్ కౌన్సిల్ డిసెంబర్ ప్రారంభంలో మద్రాసులో సమావేశమౌతుంది. అయితే ఆసమావేశము ఎజండా విషయమై యింకా అంతిమ నిర్ణయమేదీ గైకొనబడలేదు.

ఆంధ్రప్రదేశ్, మద్రాసు, మైసూరు, కేరళ రాష్ట్రాలు ఈజోనల్ కౌన్సిల్‌లో సభ్యత్వాన్ని కలిగి ఉన్నవి.

న్యూయార్కు ప్రత్తి

న్యూయార్కు అక్టోబరు 23

ప్రారంభం	31—58
ముగింపు	31—50

ఎ.ఐ.సి.సి. సమావేశానికై ముఖ్యమంత్రి ప్రయాణం

హైద్రాబాద్, అక్టోబరు 24

ముఖ్యమంత్రి శ్రీసంజీవయ్య రేపు జి.టి. ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి నాగపూర్ వెళ్ళి అక్కడినుండి అక్టోబర్ 26 వ రాయిపూర్ చేరుకొంటారు. అక్టోబర్ 27 నుండి 30 వరకూ అక్కడ జరిగే అఖిలభారత కాంగ్రెస్ కమిటీ సమావేశాలలో పాల్గొని నవంబర్ 15న హైద్రాబాద్ కుతిరిగివస్తారు.

అణుబాంబుకంటె ప్రమాదమైన ఔషధ ప్రభావం వల్ల ప్రపంచమునే అంతము చేయుటకు తయారైన ఒక అపూర్వ విచిత్ర మానవుని గాథ!

గౌతమీ పిక్చర్స్ సమర్పణ:

కాలాంతకుడు

దర్శకుడు: టి. పి. సుందరం

అక్టోబర్ 28 శుక్రవారము

బ్రహ్మాండమైన విడుదల

కమల్ రహత్ మహల్ చిత్ర

చాదర్‌ఘాట్ ముషీరాబాద్ సికింద్రాబాద్

మరియు రమేష్- నిజామాబాద్

తదుపరి మార్పు: రామా- వరంగల్

డిస్ట్రిబ్యూటర్లు: వాణిఫిలిం డిస్ట్రిబ్యూటర్లు, 8571-రాష్ట్రపతిరోడ్, సికింద్రాబాద్.

గ్రామ వార్తలు

జోగిపేట సమితి ఉపాధ్యాయ సంఘ సమావేశం

జోగిపేట, అక్టో 24

ఈనెల 5వ తేదిన జోగిపేట సమితి ఉపాధ్యాయ సంఘ కార్యనిర్వాహక వర్గం కేంద్ర పాఠశాల శివ్వంపేటయందు జరిగెను. శ్రీ జి. వెంకయ్య సమితి ఉపాధ్యాయ సంఘాధ్యక్షులు అధ్యక్షత వహించారు. సభ్యత్వమును గురించి ఉపాధ్యాయ సోదరులలో యున్న సందేహములను తొలగించుటకు శాఖపక్షాన ఆర్. శివరాజయ్య కార్యదర్శిగారు తమ అమూల్య అభిప్రాయములను ప్రకటించారు. సంఘ పటిష్ఠతనుగూర్చి అధ్యక్షులు సవివరముగా దెలిపినమీదట ఉపాధ్యాయులందరును వెంటనే సంఘ సభ్యులుగా జేరిరి. సమావేశములో ఈ క్రింది తీర్మానములు ఆమోదించబడెను.

ప్రతినెల మొదటితేదిన వేతనములు చెల్లించుట, ఈ సంవత్సరపు కన్‌టిన్‌జెన్సీస్ ల్యాపు కాకుండ అధికారులు చూచుట, సీనియార్టి ప్రకారము ప్రమోషన్లు యిచ్చుట, అకారణ బదిలీలు చేయరాదు. మెట్రిక్యులేట్ ఉపాధ్యాయులకు 1-11-1958తర్వాత వారికి ఈసమితిలో 30+30 = 60 చెల్లించుచున్నారు. ఇతరసమితులలో 40 + 5 + 30 = 75, 79, 84 చెల్లించబడుచున్నవి. అందరికి సమానముగా 45-00 బేసిక్ పే లభించునట్లు ప్రభుత్వం చూడగలదు. "మేధావి" పత్రికకు తగిన చందాదారులుగా చేరుటకు ఉపాధ్యాయులను ప్రోత్సహించనైనది.

వచ్చేమాస సమావేశము 19 నవంబరు 1960 నాడు కేంద్రపాఠశాల గడిపెద్దాపూర్‌లో జరుపుటకు నిశ్చయింపబడినది.

మంత్రి శ్రీకల్లూరి చంద్రమౌళిచే నిర్మల దేవరకోట సందర్శన

నిర్మల, అక్టో 24

అక్టోబర్ 16 వ తేది దేవాదాయ శాఖ మంత్రి శ్రీకల్లూరి చంద్రమౌళి నిర్మల దేవరకోటను దర్శించి తన సతీ సమేతుడై తీర్థప్రసాదములు స్వీకరించిరి, అదేనమయమున దేవస్థానకమిటీ ఏర్పరచబడెను. దేవస్థాన కమిటీ అధ్యక్షులు శ్రీ సుదర్శనరావు ప్రసంగిస్తూ "అతికష్టముమీద ఒకలక్షరూపాయలతో ఆలయము నిర్మించబడినది. ఇప్పటికి ఇంకా చాలకట్టడములు మిగిలినవి. అర్చకులకు మరి రోజు చేయు ఆరగింపులకు కమిటీ సభ్యులు దక్షణలతోనేనెరవేర్చుచున్నారు. కట్టవలసినది ముఖ్యముగా గాలిగోపురం అని తెలిపిరి. తదుపరి డైరెక్టరు శ్రీత్రింబక్ లాల్ ఉపన్యసిస్తూ చంద్రమౌళి చాల మంచివారు. వీటివిషయంవారికి చాల శ్రద్ధ. భద్రాద్రిరామాలయం ఇందుకు ఉదాహరణము అని తెలిపిరి. స్థానిక ఉపాధ్యాయుడు శ్రీ టి. నారాయణ స్వామి నిర్మల, వదూరు, వాంకిడి మొదలగు గ్రామముల పూర్వపు చరిత్రను గుర్తుకుతెచ్చిరి. శ్రీ గోపిడి గంగారెడ్డి ఈ ఆలయానికి ప్రభుత్వ సహాయం అత్యవసరమని విన్నవించిరి. తదుపరి శ్రీ చంద్రమౌళి ప్రసంగిస్తూ దేవాలయ నిర్మాణానికి తోడ్పడిన వారిని అభినందిస్తూ "యిలాచేయడం చాల మంచిది, మొట్టమొదలు ప్రభుత్వము ఏది లేవనెత్తజాలదు కనుక ప్రజలేముందురావాలి. ఇప్పుడు రూ. 2500 లతో గాలిగోపురము నిర్మించగలరు. ఇంకేదైనా మొదలుపెట్టితే తప్పకసహాయం చేయగలము" అని తెలిపిరి

అదేరోజు బాసర సరస్వతీ దేవాలయమును దర్శించి రాత్రికి నిర్మలలో నుండి ప్రొద్దున ఆదిలాబాదు లోని జేంజ నారాయణస్వామిని దర్శించి మంగళవారంరోజు నగరానికి పయనమైనారు. ఈ పర్యటనలో వారివెంట జిల్లాకలెక్టరు శ్రీ శ్రీనివాసాచారి, పరిషత్తు అధ్యక్షుడు శ్రీ పి. నర్సారెడ్డి, శ్రీ కె.అశన్న (ఎం. పి.) శ్రీ గోపిడి గంగారెడ్డి (ఎం.ఎల్.ఏ) మొదలగువారుండిరి. (ఒ. వి)

జీపు ప్రమాదంలో ఒక వృద్ధుని మరణం

ఇల్లెందు, అక్టో24

సింగరేణి బొగ్గుగని మేనేజర్‌కు చెందిన జీపుక్రిందపడి 80 సంవత్సరాల వృద్ధుడు వెంటనే మరణించాడు. ప్రమాదం జరిగిన సమయాన జిల్లా పోలీస్ సూపరింటెండెంటు అచ్చటనే వుండెను. శవపరీక్ష జరిపించారు. జీపు డ్రైవర్‌పై కేసు కోర్టులో పెట్టనున్నట్లు తెలుస్తున్నది. (స్వ. వి)

అగ్ని ప్రమాదంలో ఇద్దరి మృతి

నిజామాబాద్, అక్టో 24

బోధన్ సబ్ డివిజన్‌లోని తిమ్మాపూర్‌లో గన్నప్ప అనునాతని ఇంట జరిగిన అగ్నిప్రమాదంలో చిక్కుకొని పాయన్న, లచ్చమ్మ మరణించారు.

సెంట్రల్ రైల్వే

హర్రాజు అమ్మకపు నోటీసు

1890 సంవత్సరపు భారతీయ రైల్వేల చట్టం 9 యొక్క 55 మరియు 56 సెక్షన్‌ల అనుసరించి ఇనుపసామగ్రి గాజు సామాను ఇతర చిల్లరసామగ్రి పెద్ద మొత్తములో సికింద్రాబాద్‌లోని అన్‌కనెక్టెడ్ గూడ్స్ మరియు పార్సిలు ఆఫీసువద్ద 1960 నవంబర్ 20 వ తేదీ ఆదివారం ఉదయం 10-30 నిముషాల నుండి సాయంత్రము 5-00 గంటల వరకు విక్రయింపబడగలదు. హర్రాజులో పెట్టబడే సామగ్రి వివరములు అమ్మకపు పత్రులు గల సైక్లోస్టైల్ కాపీలు హర్రాజు అమ్మకానికి వారం రోజుల ముందుగా సికింద్రాబాద్‌లోని అన్‌కనెక్టెడ్ గూడ్స్ అండ్ పార్సిల్స్ ఆఫీసు ఇన్‌చార్జి క్లర్క్ నుండి పొందవచ్చును. ఈ సంబంధంలో వలసిన పూర్తి సమాచారాన్ని సికింద్రాబాదు క్లెయిమ్స్ సూపరింటెండెంటు నుండి గూడా పొంద వచ్చును. నవంబర్ 19 వ తేదీశనివారం ఉదయం 11 నుండి ఒంటిగంటవరకు మరియు 2 నుండి 5 గం॥ వరకు హర్రాజు సామగ్రిని తనఖ చేసుకోవచ్చును.

క్లెయిమ్స్ సూపరింటెండెంట్

క్లెయిమ్స్ సూపరింటెండెంట్ ఆఫీస్

సికింద్రాబాద్

తేది 18-10-60.

సెక్రెటరీ కార్యాలయము

హైద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

నెం. 3. తేది: 21-10-1960

దిగువ విషయముల చర్చించుటకుగాను హైద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ యొక్క సాధారణ సమావేశమును దారుషఫా మున్సిపల్ కార్పొరేషన్‌హాలులో 31-10-1960 సోమవారము సా॥ 5-00 గం॥ జరుపబడును.

1. 3-8-1960 మరియు 12-9-1960 తేదీల పభాచర్యలధ్రువీకరణ.
2. ప్రశ్నలు.
3. స్టాండింగు కమిటీ తీర్మానము: హైద్రాబాద్‌లోని కుష్ఠు రోగుల యొక్క కుష్ఠు ఉద్యమము- నివారణ- మౌలాలీవద్ద పునరావాస కేంద్రము ప్రారంభించుట.
4. స్టాండింగ్ కమిటీ తీర్మానము: హైద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎస్టాబ్లిష్‌మెంట్- గౌరవనీయ లిప్రోలజిస్టు- సర్వీసును పొడిగించుటకు- కోరనైనది.
5. స్టాండింగ్ కమిటీ తీర్మానము: 1959-60 వైద్యసహాయము- హైద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎస్టాబ్లిష్‌మెంట్- నిల్వయున్న బిల్లుల చెల్లింపు.
6. హైద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ యొక్క ఎస్టాబ్లిష్‌మెంట్ ఆరోగ్యము- అనాథులై చనిపోయినవారి మృతదేహముల పాతరవేయుటకు నాజర్ల నియమించుటకు మంజూరీగురించి హైద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ నోటు.
7. స్టాండింగ్ కమిటీ తీర్మానము: దుర్వాసన మరియు కన్సర్‌వెన్సీ ఉపయోగమునకు సింగ్‌ఫాగ్ మెషిన్‌కొనుట.
8. స్టాండింగ్ కమిటీ తీర్మానము: హైద్రాబాద్‌లో భిడుక గృహము ప్రారంభించుట- కార్యక్రమము గురించి హైద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రతిపాదన.
9. స్టాండింగ్ కమిటీ తీర్మానము: మున్సిపాలిటీ యొక్క అఖిల భారత సమావేశపు- సమావేశము గురించి.
10. స్టాండింగ్ కమిటీ తీర్మానము: అసిస్టెంట్ ఆక్టాయ్ సూపరింటెండెంటుకు ప్రత్యేక వేతనము మంజూరి గురించి.
11. సికింద్రాబాద్ మహాత్మాగాంధి రోడ్‌లోని రామ్‌గోపాల్ విగ్రహం వద్ద గల పార్కులో త్రాగే నీటి గది నిర్మాణమునకు స్థలము కౌలు గురించి హైద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ నోటు.
12. మిడిల్ ఇన్‌కమ్ గ్రూప్ హౌసింగ్ పథకము క్రింద గృహముల నిర్మాణము గురించి- మారేడ్‌పల్లి లో శ్రీ గోవిందరావునుండి మరియు భూలోక్‌పూర్‌లో ఆంధ్ర సారస్వత పరిషత్తు నుండి కొన్న స్థలములను హౌసింగ్ బోర్డుకు యిచ్చుటగురించి హైద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ నోటు.
13. మారేడ్‌పల్లిలో శ్రీ మన్‌సబ్‌జంగ్ బహద్దూర్‌కుగలస్థలమును పొందుట గురించి హైద్రాబాద్ మున్సిపల్ కమీషనర్ నోటు.
14. తుకారాంగేటు ప్రాంతపు వివాసులకు నీటి సరఫరాకు మల్కాజిగిరి వద్ద గల బావిని సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌చే తీసుకొనుట గురించి హైద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ నోటు.
15. డాక్టర్ మోహన్‌రావు సర్వీసు భాయపరచుట- భాయపరచుటలో తేదీ మార్పు- ఎస్టాబ్లిష్‌మెంట్ గురించి హైద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ నోటు.
16. బాలుర చర్మాస్పత్రి- ఒక సంవత్సరమునకు పథకమును పొడిగించుట గురించి హైద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ నోటు.
17. రైల్వే లైనునుండి రాణిగంజ్ వరకు సమానముగా పోవు రోడ్డును వెడల్పుచేయుటకు సికింద్రాబాద్ రాణిగంజ్‌వద్దగల ఇంటినెం: 7953 యొక్క స్థలము పొందుట గురించి హైద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సెక్రెటరీ నోటు.
18. మారేడ్‌పల్లివద్ద గల మున్సిపల్ బ్లాకుల కేటాయించుటగురించి స్టాండింగ్ కమిటీ తీర్మానముపైన తదుపరి చర్య నిలుపుచేయుటకు శ్రీ అల్లాడి వెంటయ్య మున్సిపల్ కౌన్సిలర్ ప్రతిపాదన.
19. యూనిఫ్ కంపెనీ నుండి ఎ ఎన్. ఎస్. సందువరకుగల వీధికి పేరుపెట్టుట గురించి శ్రీ మిర్జా జామిల్ అహమద్ బేగ్ మున్సిపల్ కౌన్సిలర్ ప్రతిపాదన.
20. మున్సిపల్ కౌన్సిలర్ శ్రీ ఎస్. ఎం. జీలానీ తండ్రి మరణముపట్ల సంతాపము తెలుపుటకు శ్రీ మహమ్మద్ అహమద్ మున్సిపల్ కౌన్సిలర్ ప్రతిపాదన.
21. మున్సిపల్ కౌన్సిలర్ శ్రీ రంజిత్‌సింగ్ తల్లి మరణముపట్ల సంతాపము తెలుపుటకు శ్రీ మహమ్మద్ అహమద్ మున్సిపల్ కౌన్సిలర్ ప్రతిపాదన.

సెక్రెటరీ,

హైద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్.

సుప్రీంకోర్టుచే పంజాబ్ ప్రభుత్వ పిటిషన్ త్రోసివేత

న్యూఢిల్లీ, అక్టో 24

హజరాసింగ్ మరో యిద్దరిపై హత్యానేరం మోపబడిన మాజీ పోలీసు సూపరింటెండెంట్ డి. ఎస్. గ్రేవల్ మరో 9 మంది పోలీసుల్ని విడుదల చేయాలనే పంజాబ్ హైకోర్టు ధ్రువీకరణకు వ్యతిరేకంగా అపీలు చేయడానికి ప్రత్యేకానుమతి నివ్వాలిందిగా పంజాబ్ ప్రభుత్వం పెట్టుకొన్న పిటిషన్‌ను సుప్రీంకోర్టు త్రోసివేసింది.

విచారణ కోర్టు తనపై పేర్కొన్న అంశాల్ని తొలగించాలని పోలీసు డి.ఐజి శ్రీరాంసింగ్ పెట్టుకొన్న పిటిషన్‌నుకూడ కోర్టు త్రోసివేసింది.

1957 జూలైలో ముగ్గురి హత్య సందర్భంలో గ్రేవల్ మరి 9 మంది కర్నల్ పోలీసులపై ప్రాసిక్యూషన్ కేసు నడపబడింది. వారు ఆ ముగ్గురినీ ట్రక్కులో అపహరించి చెట్టుకు కట్టి కాల్చివేశారని నేరం ఆరోపించబడింది.

బోధన్‌లో కాగితం ఫ్యాక్టరీ స్థాపన

నవంబర్ 4 న మంత్రివర్గంచే ప్రతిపాదన పరిశీలన

హైద్రాబాద్, అక్టో 24

నవంబర్ 4 న సమావేశమయ్యే ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం నిజామాబాద్ జిల్లా బోధన్‌లో కాగితం ఫ్యాక్టరీని నెలకొల్పే అంశాన్ని పరిశీలిస్తుంది.

చెరుకు పిప్పిని వినియోగించి ఒక న్యూస్ ప్రింట్ (వార్తాపత్రికల కాగితం) ఫ్యాక్టరీని నెలకొల్పాలని ముందు సంకల్పించబడింది. కాని సాంకేతిక సలహాపై ఆ ప్రతిపాదన విరమించుకోబడింది. ఇప్పుడు సాధారణ కాగితాన్ని తయారుచేసే ప్రతిపాదన వచ్చింది. ఈ విషయమై నిపుణుల నివేదిక సిద్ధంగా ఉందట.

కొత్తగూడెంలో నెలకొల్పు సంకల్పించిన ఎరువుల ఫ్యాక్టరీకి డైరెక్టర్ల బోర్డును ఏర్పాటు చేసే విషయాన్ని కూడ మంత్రివర్గం పరిశీలిస్తుంది.

అవినీతి నిరోధకశాఖ పనిచేయవలసిన విధానంపై ప్రత్యేకాధికారి శ్రీ ఎస్. విజయరంగం నాయుడు సమర్పించిన నివేదికను కూడ మంత్రివర్గం పరిశీలిస్తుంది. ఈ శాఖలో బొంబాయి వ్యవస్థలో వికేంద్రీకృత పరిపాలననుసరించాలని సూచిస్తూ శ్రీ నాయుడు తన నివేదికను సమర్పించారు.

జనాభా లెక్కలు

1961

ఫిబ్రవరి 10 - మార్చి 5



మీ వీధి గుమ్మం గోడపై యిటువంటి సంఖ్య ఒకటి మీరు యీసరికే చూచివుంటారు. లేదా త్వరలోనే చూస్తారు.

రానున్న జనాభా లెక్కలలో మీరు యీ సంఖ్యతోనే గుర్తింపబడుతారు, లెక్కింపబడుతారు. కాబట్టి జనాభా లెక్కలలో యిదే మీ సంఖ్య అన్న మాట. ఈ సంఖ్య చెరిగిపోకుండా, ఎలాంటిదలా వుండేలా తప్పక చూడండి. జనాభా లెక్కల సేకరణ కార్యక్రమానికి అన్నివిధాలా యితోధికంగా సహాయంచేయండి.

మీరిచ్చే ఏ సమాచారమైనా అతిరహస్యంగా వుంచబడుతుంది. పూర్తి రక్షణ యివ్వబడుతుంది.

భారత ప్రభుత్వ ప్రకటన.

DA 60/459.

10 వ సంయుక్త వారము

అశ్వరాజ్ వారి

దీపావళి

(నరకాసుర కథ)

డా॥ ఎన్. టి. రామారావు, ఎన్.వి. రంగారావు, సావిత్రి.

సాగర్- హైద్రాబాదు

ఆఖరి రెండు రోజులు.

చిత్రా- సికింద్రాబాదు

నేడు 2 ఆటలు: 6-00, 9-30.

మరియు లక్ష్మి- వరంగల్

హెచ్చు తరగతులకు అడ్వాన్సు బుకింగ్.

Nima) —పూర్ణా విడుదల.

4 వ సంయుక్త వారము

మాంగల్యం

రాజశ్రీ రిలీజ్

డా॥ కాంతారావు, దేవిక, రామకృష్ణ, రాజనాల, రాజశ్రీ.

కమల్

హైద్రాబాదు.

అలంకార్

సికింద్రాబాదు.

ఆటలు: 6-00, 9-30 గం॥

హెచ్చు తరగతులకు అడ్వాన్సు బుకింగ్ గలదు.

మార్కండేయ - వరంగల్.

పిక్చర్ ప్యాలెస్ -నిజామాబాదు.

(Nima) —రాజశ్రీ విడుదల.

Edited Printed and Published by N. Narotham Reddy M. A. for the Golkonda Publication Ltd At the Golkonda Printing Press Hyderabad (A.P)